కరీంనగర్ వార్త
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
శుక్రవారం 27, మార్చి 2026 16 పేజీలు



# ఆసుపత్రి పరికరాలపై ప్రతిపాదనలు సమర్పించాలి



2లో

# ధర్మనిరతికి నిలువుటద్దం శ్రీరాముడు





సత్య స్వరూపుడుగా ప్రసిద్ధిగాంచిన శ్రీరామచంద్రుడు

త్రేతా యుగంలో జన్మించిన శ్రీరాముడు

రావణుని సంహరించి అయోధ్యలో పట్టాభిషిక్తుడైన రాముడు

నేడు జమ్మికుంట రైల్వేస్టేషన్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో రాములోరి కళ్యాణానికి భారీ ఏర్పాట్లు..

2లో

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త: జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆబాది జమ్మికుంటలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ ఆలయంలో, రైల్వే స్టేషన్ సమీపంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో నేడు శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం వైభవంగా కన్నుల పండువగా జరగనుంది. శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటి సభ్యులు, ఆలయ అర్చకులు డింగరి ప్రవీణాచార్యులు, ఎలబాక ఫణిశర్మ, దేశ్‌ముఖ్ విజయ్ శర్మ తెలిపారు. శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 12.10 నిమిషాలకు సీతారామ కళ్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.



# బస్సు ప్రమాదంలో వలస జీవులు మృతి

## నలుగురు మృతి నలుగురికి తీవ్ర గాయాలు

## శోకసముద్రంలో కుటుంబ సభ్యులు

2లో



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: మల్కాపురంలో జరిగిన బస్సు ప్రమాదంలో ఆంధ్రప్రాంతానికి చెందిన నలుగురు వలస జీవులు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు 2లో ఉన్నాయి

# సింగరేణిలో ఎన్నికల దిశగా కదలికలు

కేంద్ర కార్మికశాఖ నుంచి లేఖ యూనియన్ల ప్రతిపాదనలు పరిశీలనకు..



గోదావరిఖని,ప్రభాతవార్త: సింగరేణి కొల్లియరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీ ఎల్)లో యూనియన్ ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), హైదరాబాద్ కార్యాలయం నుంచి కంపెనీ యాజమాన్యానికి లేఖ జారీంది. ఇప్పటికే ఎస్‌సీసీఎల్‌లో పనిచేస్తున్న పలు కార్మిక సంఘాలు యూనియన్ ఎన్నికలను త్వరగా నిర్వహించాలని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించాయి. గత ఎన్నికలు 27 డిసెంబర్ 2023న జరిగిన నేపథ్యంలో, రెండేళ్ల కాలం పూర్తవుతున్నందున త్వరలోనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని యూనియన్లు కోరినట్లు లేఖలో పేర్కొన్నారు.

2లో

# ధర్మనిరతికి నిలువుటద్దం శ్రీరాముడు

### సత్య స్వరూపుడుగా ప్రసిద్ధిగాంచిన శ్రీరామచంద్రుడు

### త్రేతా యుగంలో జన్మించిన శ్రీరాముడు

### రావణుని సంహరించి అయోధ్యలో పట్టాభిషిక్తుడైన రాముడు

### నేడు జమ్మికుంట రైల్వేస్టేషన్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో రాములోరి కళ్యాణానికి భారీ ఏర్పాట్లు..

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆబాది జమ్మికుంటలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ ఆలయంలో, రైల్వే స్టేషన్ సమీపంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో నేడు శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం వైభవంగా కన్నుల పండువగా జరగనుంది. శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటి సభ్యులు, ఆలయ అర్చకులు డింగరి ప్రవీణాచార్యులు, ఎలబాక ఫణిశర్మ, దేశ్‌ముఖ్ విజయ్ శర్మ తెలిపారు. శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 12.10 నిమిషాలకు సీతారామ కళ్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి స్వామివారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు. జమ్మికుంట రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కనివిని ఎరుగని రీతిలో ఆలయ కమిటీ పాలకవర్గం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేసింది. ఈ ఆలయంలో జరుగుతున్న సీతరామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవానికి జమ్మికుంట పట్టణ పురప్రముఖులు, వందలాది కుటుంబాలు హాజరుకానున్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌ను పక్కనే ఉన్నందున రైల్వేస్టేషన్ ప్రాంగణాన్ని చలువ పందిళ్లు వేసి భారీ ఎత్తున ఎల్ఈడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్(దిలీప్), వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ (జావిద్)లతో పాటు వేలాది మంది పాల్గొననున్నారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

### చెల్పూర్‌లో రాములోరి కళ్యాణానికి భారీ ఏర్పాట్లు..

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం చెల్పూర్ మేజర్ గ్రామపంచాయితీలో గల శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ, బస్మాంగి శంకరయ్య ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడు లేని విధంగా కనివిని ఎరుగని రీతిలో అన్ని విధాల ఏర్పాట్లు చేసారు. గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ వంతడుపుల కస్తూరి స్వామి వారి ఆలయ ప్రాంగణానికి రంగులు దిద్ది మామిడి తోరణాలు, సప్తవర్ణాల పుష్పాలతో దేదివ్యమానంగా అలంకరించారు. ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు రామభక్తులు స్వచ్చందంగా విరాళాలు పోగుచేసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. పులిహోర, లడ్డు, మజ్జిగ ప్యాకెట్లు, పెద్ద మొత్తంలో పంపిణీకి ఏర్పాట్లు చేసారు. గత 40 సంవత్సరాలుగా ప్రతియేట జరుగుతున్న చెల్పూర్ సీతరామా చంద్రస్వామి కళ్యాణ మహోత్సవానికి చెల్పూర్, రాజపల్లి, జూపాక, ఇందిరానగర్-శాలపల్లి గ్రామాల నుండే కాకుండా సుదూర ప్రాంతాల నుండి రాములోరి కళ్యాణానికి హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

శ్రీరామనవమి వేడుకలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. అత్యంత ఘనంగా భక్తిశ్రద్ధలతో సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించేం దుకు ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి గావించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. సీతారాముల కళ్యాణం సందర్భంగా పలువురు దంపతులు పీటలపై కూర్చోనున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కళ్యాణం జరగనుంది. భక్తులు కన్నుల విందుగా తిలకించేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీ కోదండ రామస్వామి, ఆంజనేయస్వామి తదితర దేవాలయాలలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్ని అంటే ఎలా నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. హరే రామ నామ సంకీర్తనతో ఆలయాలు మారుమోగుతాయి. జిల్లాలలోని ప్రధాన ఆలయాలు సైతం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో ఆలయాలను ఆకర్షనీయంగా అలంకరించారు. శ్రీరామచంద్రుడు వసంత ఋతువులు చైత్ర శుద్ధ నవమి రోజు జన్మించాడు. కర్కాటక లగ్నంలో అభిజిత్ ముహూర్తంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో కౌసల్య శ్రీరాముడికి జన్మనిచ్చింది. శ్రీరాముడు త్రేతాయుగంలో జన్మించాడు. 14 సంవత్సరాలు అరణ్యవాసం చేసిన అనంతరం రావణ సంహారం అనంతరం శ్రీరాముడు సీతా సమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడైనాడు. ఇదంతా చైత్రమాసం శుద్ధ నవమి రోజు జరిగిందని ప్రజల విశ్వాసం. శ్రీ సీతారాముల కళ్యాణం కూడా అదే రోజు జరిగింది. వాల్మీకి రాసిన రామాయణం ప్రకారం అయోధ్యకు రాజైన దశరథుడికి ముగ్గురు భార్యలు. కౌసల్య, సుమిత్ర, కైకేయి. సంతానం లేకపోవడంతో రాజ్యానికి వారసులు ఉండరని దశరథుడు భావించాడు. ఈ నేపథ్యంలో వశిష్ట మహాముని దశరథ రాజుకు పుత్ర కామేష్టి యాగం చేయమని సలహా ఇచ్చాడు. ఋశ్యశృంగ మహామునికి యజ్ఞాన్ని చేయమని బాధ్యతలను అప్పగించాడు. వెంటనే దశరథుడు యజ్ఞ యాగాలు చేయించా రు. యజ్ఞానికి తృప్తి చెందిన అగ్నిదేవుడు పాయసంతో నిండిన ఒక పాత్రను దశరథుడికి ఇచ్చాడు. సదరు పాయసం భార్యలకు ఇవ్వమన్నాడు. దశరథుడు అందులో సగభాగం మొదటి భార్య కౌసల్యకు రెండో సగభాగం చిన్న భార్య అయిన కైకేయి కి ఇచ్చాడు. వారిద్దరూ వారి వాటాల్లో సగం మిగిల్చి రెండో భార్య అయిన సుమిత్రకు ఇచ్చారు. కొద్ది కాలానికి వారు గర్భం దాల్చారు. నవమి రోజు మధ్యాహ్నం కౌసల్యకు రాముడు జన్మించాడు. కైకేయికి భరతుడు సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నలు జన్మించారు. శ్రీరాముడు ధర్మ సంస్థాపనార్థం అవతరించిన శ్రీ మహావిష్ణువు ఏడవ అవతారం. రావణుని అంతమొందించేందుకు అవతరించాడు. జ్యోతి శాస్త్రం పరిశోధనల ప్రకారం శ్రీరాముడు క్రీస్తుపూర్వం శాలివాహన శకం 5114 సంవత్సరం జనవరి 10వ తేదీన జన్మించి ఉండవచ్చని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలో సీతారాముల కళ్యాణం ఉత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా జరుపుతారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కళ్యాణాన్ని తిలకిస్తారు. ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను వారికి కళ్యాణం సందర్భంగా సమర్పిస్తారు. భద్రాచలం శ్రీ కోదండ రామస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాల కాంతులతో అలంకరిస్తారు. రామాయణాన్ని పారాయణం చేస్తారు. శ్రీరాముడితో పాటు సీతాదేవిని, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామిని కూడా ఆరాధిస్తారు. శ్రీరామనవమి వేసవికాలంలో వస్తుంది. వేసవికాలంలో సూర్యుడు ఉత్తరార్థ గోళానికి చేరువగా వస్తాడు. సూర్యుడు రాముడు జన్మించిన సూర్యవంశానికి ఆరాధ్యుడుగా చెబుతారు. శ్రీరాముడు మాటమీద నిలబడే వ్యక్తిగా ప్రసిద్ధిగాంచాడు. తండ్రి, పినతల్లి కైకేయికి ఇచ్చిన మాట కోసం 14 సంవత్సరాలు వనవాసం చేశాడు. ఈ నేపథ్యంలోనే రాముడిని రఘు రాముడని, రఘునాథుడని, రఘుపతి, రాఘవేంద్రుడని తదితర పేర్లతో పిలుస్తారు. ముఖ్యంగా రామాయణం రామనవమిలలో సూర్యుని ఆరాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. రవి అంటే సూర్యుడు. అత్యున్నత విలువలను పాటించి తనను తాను దైవంగా మలుచుకున్నాడు శ్రీరామచంద్రుడు. శ్రీరామచంద్రుని అస్తిత్వానికి మూలాధారం ధర్మం. సంఘర్షణ ఏర్పడిన ప్రతిసారి వ్యక్తిగత ప్రయోజనం కంటే సమిష్టి ప్రయోజనానికి ప్రాధాన్యత ఇచ్చి తన గమనాన్ని దైవత్వం వైపు నడిపించాడు శ్రీరాముడు. తన సౌఖ్యం కంటే ప్రజాభిప్రాయానికి విలువనిచ్చి ప్రాణసంమానురాలైన సీతను పరిత్యధించి రాజ ధర్మాన్ని నిలబెట్టాడు. సమాజంలో ధర్మాన్ని కాపాడి శాంతిని నెలకొల్పటానికి తాటక నుంచి రావణుని వరకు లోకకంతకులను సంహరించి వీర ధర్మాన్ని రక్షించాడు. అరణ్యవాసంలో భరతునికి చేసిన ఉపదేశంలో రాజ్యాభివృద్ధికి తోడ్పడే ఆర్థిక సూత్రాలని గమనిస్తే రాముని పరిపాలన సామర్థం ఆర్థిక వనరుల నిర్వహణ అర్థం అవుతుంది. పరిపాలకులు ఎలా ఉండాలో రాముడు భరతుడికి వివరించాడు. ధర్మ విరుద్ధమైన సంపద వినాశనానికి దారితీస్తుందని రావణాసురుని సంపద నిరూపించింది. కామాన్ని ధర్మబద్ధంగా ఎలా అనుభవించాలో రాముడి ఆదర్శ జీవితం అందరికీ నేర్పిస్తుంది. సీతా దేవికే అంకితమై ఏకపత్నివ్రతాన్ని పాటించాడు. ధర్మం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడటం, రామరాజ్యం అంటే ఎలా ఉండాలో వివరించిన ఆదర్శవంతుడు శ్రీరాముడు.

## బస్సు ప్రమాదంలో వలస జీవులు మృతి

### నలుగురు మృతి నలుగురికి తీవ్ర గాయాలు

### శోకసముద్రంలో కుటుంబ సభ్యులు

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** మల్కాపురంలో జరిగిన బస్సు ప్రమాదంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన నలుగురు వలస జీవులు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఉన్నాయి ఆంధ్ర ప్రాంతానికి చెందిన హరికృష్ణ ప్రైవేటు బస్సు బుధవారం జగిత్యాల నుండి మేడిపల్లి కోరుట్ల మెట్పల్లి నిజామాబాద్ హైదరాబాద్ మీదుగా వినుకొండకు బయలుదేరింది జగిత్యాల జిల్లాలో నివసిస్తున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెంది న రాయికల్ మండలంలోని రామారావు పల్లెలో ఉప్పర రమాదేవి ఉప్పర మనోహర్, అయోధ్యకు చెందిన వెంకటేష్ తుపాకుల రత్నమ్మ తుపాకుల కిరణ్ మనవసిస్తూ ఉన్నారు. వీరు స్వగ్రామానికి వెళ్లడానికి వెళ్లడానికి మేడిపల్లి బస్టాండ్లో హరికృష్ణ బస్సు ఎక్కారు, అలాగే జగిత్యాల రూరల్ మండలం అనంతరం గ్రామంలో రెక్కలగడ్డ మనోహర్ జగిత్యాల బస్టాండ్ లో బస్సు ఎక్కారు మేడిపల్లి మండలం తంబారావుపేట గ్రామంలో నివసిస్తున్న క్షేత్ర ఆమె తల్లి ప్రభావతి లు స్వగ్రామానికి పోవడానికి మేడిపల్లి బస్టాండ్ లో ప్రైవేటు బస్సు ఎక్కారు. స్వర్గానికి వెళ్తున్న మార్గమధ్యం మర్కాపురం జిల్లాలో అగ్ని ప్రమాదానికి గురికాగా బస్సులో ఉన్న వెంకటేష్



48 ఉప్పర రమాదేవి 55 క్షేత్ర ఆరు సంవత్సరాలు ప్రభావతి 50 సంవత్సరాలు మృతిచెందగా రెక్కలగడ్డ మనోహర్ తుపాకుల రత్నమ్మ తుపాకుల కిరణ్ ఉప్పుల మనోహర్ తీవ్ర గాయాలు అయ్యాయి. వీరు ఆంధ్ర ప్రాంతం నుండి వలస కార్మికులుగా జగిత్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మేస్త్రి పనులు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ బస్సు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా నలుగురు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటుతున్నాయి.

## సింగరేణిలో ఎన్నికల దిశగా కదలికలు

### కేంద్ర కార్మిక శాఖ నుంచి లేఖ

### యూనియన్ల ప్రతిపాదనలు పరిశీలనకు...

**గోదావరిఖని,ప్రభాతవార్త:** సింగరేణి కొల్లియరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లో యూనియన్ ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), హైదరాబాద్ కార్యాలయం నుంచి కంపెనీ యాజమాన్యానికి లేఖ జారీంది. ఇప్పటికే ఎస్‌సీసీఎల్‌లో పనిచేస్తున్న పలు కార్మిక సంఘాలు యూనియన్ ఎన్నికలను త్వరగా నిర్వహించాలని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించాయి. గత ఎన్నికలు 27 డిసెంబర్ 2023న జరిగిన నేపథ్యంలో, రెండేళ్ల కాలం పూర్తవుతున్నందున త్వరలోనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని యూనియన్లు కోరినట్లు లేఖలో పేర్కొన్నారు.

### ప్రతిపాదనలు సమర్పించిన సంఘాలలో...

ఏబీ సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్.. గోదావరి లోయ బొగ్గు గని కార్మిక యూనియన్.. శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం... తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం.. ఉన్నాయి. అదనంగా, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కూడా ఎన్నికలు త్వరగా నిర్వహించాలంటూ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినట్లు లేఖలో వెల్లడించారు. ఇక ఎన్నికలు పూర్తయ్యే వరకు కార్మికులకు సంబంధించిన విధాన నిర్ణయాలు అన్ని జేబీసీసీఐ ప్రతినిధి సంఘాల సమ్మతితోనే తీసుకోవాలని యూనియన్లు కోరిన విషయాన్ని కూడా అధికారులకు తెలియజేశారు. యూనియన్ల నుంచి అందిన ప్రతిపాదనల ప్రతులను కంపెనీ యాజమాన్యానికి పంపిస్తూ, వాటిపై స్పష్టమైన అభిప్రాయాలను 10 రోజుల్లోగా తెలియజేయాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సూచించారు. ఈ పరిణామాలతో సింగరేణిలో యూనియన్ ఎన్నికల దిశగా కదలికలు వేగం పుంజుకునే అవకాశముందని కార్మిక వర్గాల్లో చర్చ సాగుతోంది.



### ఆసుపత్రి పరికరాలపై

## ప్రతిపాదనలు సమర్పించాలి

### రామగుండం జనరల్ ఆసుపత్రి తనిఖీలో కలెక్టర్ ఆదేశాలు



**గోదావరిఖని, ప్రభాతవార్త:** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశిం చారు. గురువారం రామగుండం జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం, క్రిటికల్ కేర్ సెంటర్, ఎస్ఎన్‌సీయూ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్, చిన్నపిల్లల విభాగం, ఫిజియోథెరపీ విభాగాలను కలెక్టర్ సందర్శించి సేవల స్థితిని పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్సపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రికి అదనంగా ఒక ఎక్స్ రే యంత్రం, అల్ట్రాసౌండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఫిజియోథెరపీ విభాగాన్ని సమర్థవంతంగా నడిపేందుకు అవసరమైన సిబ్బంది నియామకాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. వైద్యులు సమయానికి విధులకు హాజరై రోగులకు నాణ్యమైన సేవలు అందించాల న్నారు. ఆసుపత్రి నూతన భవనంలోని అవుట్ పేషెంట్ గదులను పరిశీలించిన కలెక్టర్, నిర్వహణలో మరింత మెరుగుదల అవసరమని సూచించారు. సదరం విభాగంలో చేసిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో గోదావరిఖనిలో నిర్మించిన ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణం, సదుపాయాలపై వివరాలు తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. ఈ పర్యటనలో వైద్య అధికారులు డాక్టర్ అరుణ, డాక్టర్ కృపాభాయ్, డాక్టర్ రాజు, నర్సింగ్ పర్యవేక్షకులు మరదలినతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వింత రోగాలతో వీధి కుక్కలు.. భయాందోళనల్లో సుల్తానాబాద్ ప్రజలు...

పిల్లలను బయటకు పంపేందుకు భయపడుతున్న తల్లిదండ్రులు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



సుల్తానాబాద్ పట్టణంలో వీధి కుక్కల్లో కనిపిస్తున్న వింత రోగాలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో వీధి కుక్కలు అసాధారణంగా ప్రవర్తించడం, శరీరంపై గాయాలు కనిపించడం, వెంట్రుకలు ఊడిపోవడం, నోటి నుండి నురుగు రావడం వంటి లక్షణాలు కనిపిస్తున్నా యని ప్రజలు చెబుతున్నారు.దీంతో ప్రజలు బయటకు వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది.

### గుంపులుగా తిరుగుతున్న కుక్కలు..

పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి.రాత్రి వేళల్లో ఎక్కువగా తిరుగుతున్న కుక్కలు కొన్నిసార్లు ఉగ్రంగా ప్రవర్తిస్తూ రోడ్డుపై వెళ్తున్న వారిని వెంబడిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ముఖ్యంగా చిన్నపిల్లలు,వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్నారు.పిల్లలను బయటకు పంపేందుకు భయపడుతున్న తల్లిదండ్రులుపాఠశాలలకు వెళ్లే చిన్నపిల్లలు వీధుల్లో నడవాల్సి రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు బయట ఆడుకోవడానికి కూడా పంపించేందుకు భయపడుతున్నామని పలువురు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల కుక్కలు అనారోగ్యంతో రోడ్లపై పడిపోయి ఉండటం కూడా ప్రజలను కలవరపెడుతోంది.వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అనారోగ్యంతో ఉన్న కుక్కలను గుర్తించి చికిత్స చేయడం, వీధి కుక్కలను పట్టుకుని టీకాలు వేయించడం వంటి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ ప్రజలు కోరుతున్నారు.

### వెంటనే చర్యలు చేపట్టాలి

-బుర్ర శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్

పట్టణ కేంద్రంలో వింత రోగాలతో వీధి కుక్కలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి,ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లడానికి కూడా సంకోచిస్తున్నారు.వాటికి వచ్చే వ్యాధులు మనుషులకు సోకకుండా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ కుక్కలను గుర్తించి వైద్య పరీక్షలు చేయించాలి.అలాగే రేబిస్ వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపించకుండా టీకాలు వేయించడం అత్యంత అవసరం. ప్రజల భద్రత దృష్ట వీధి కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

### ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

-రఘుపతి రెడ్డి, వెటర్నరీ వైద్యులు

ఈ విషయంపై వెటర్నరీ వైద్యులు మాట్లాడుతూ,వీధి కుక్కల్లో కనిపిస్తున్న లక్షణాలు చర్మవ్యాధులు,పోషకాహార లోపం వంటి కారణంగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న కుక్కల దగ్గరకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వీధి కుక్కలతో ఆడుకోవడం లేదా దగ్గరికి వెళ్లడం నివారించాలని చెప్పారు.

### సెంటర్లు లేక నివారణ చర్యలు కష్టతరం

టి. రమేష్, మున్సిపల్ కమిషనర్

పట్టణంలో అనారోగ్యంతో ఉన్న వీధి కుక్కలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడానికి సరియైన స్టెరిలైజేషన్ సెంటర్లు అందుబాటులో లేకపోవడంతో కుక్కలకు వచ్చే వ్యాధులను నియంత్రించలేకపోతున్నాం. సెంటర్లు అందుబాటులోకి రాగానే పట్టణంలో వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.ప్రజలు కూడా కుక్కలను రెచ్చగొట్టకుండా జాగ్రత్తలు పాటించాలి.

## నేరాలు-దారుణాలు

# వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం

ఏడాది క్రితం అనారోగ్యంతో కూతురు మృతి

రోడ్డున పడ్డ భార్య కూతురు.. కనగర్తిలో విషాదం

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



అనారోగ్యంతో ఏడాది క్రితం కూతుర్ని కోల్పోయిన ఆ కుటుంబం లో మరో విషాదాన్ని చోటు చేసుకుంది. వడదెబ్బ రూపంలో కుటుంబ పెద్దను మృత్యువు కబలించింది. పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య, కూతురు రోడ్డున పడ్డ ఘటన కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన పులి రవి(38) వడదెబ్బతో మృతి చెందాడు.రోజు వారిగా ఉపాధి హామీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నా క్రమంలో వడదెబ్బ తగిలి అస్వస్థకు గురయ్యాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే దవాఖనకు తరలించేందుకు ప్రయత్నించారు. ఇదే తరుణంలో దవాఖనకు వెళ్లేలోపే మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య నిర్మల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా గత ఏడాది క్రితం కూతురు మృతిచెందడంతో కుటుంబం ఇప్పటికే విషాదంలో ఉంది. ఇప్పుడు కుటుంబ పెద్ద దిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం దు:ఖ సాగరంలో మునిగి పోయింది. ఈ ఘటన గ్రామంలో విషాదం నింపగా, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ మల్యాల స్వామిదాసు, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి భారతి కోరారు.

# బలవంతపు లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

6,600 రూపాయల జరిమానా

మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా పోలీస్ లను సంప్రదించండి

జిల్లా ఎస్పి అశోక్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా గోలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళపై లైంగిక దాడి, బెదిరింపుల కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది.2026 మార్చి 26 న అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి నారాయణ కేసును విచారించి నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 6,600 రూపాయల జరిమానా విధించారు. వివరాల్లోకి ఇలా ఉన్నాయి దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నర్నేడ్ల మహేందర్ 29 గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధి కి చెందిన బాధితురాలిని గతంలో రహస్యంగా చిత్రీకరించిన వీడియోలను ఆధారంగా తీసుకొని ఆమెను బెదిరిస్తూ బాధితురాలు యొక్క వ్యక్తిగత గోప్యతను దుర్వినియోగం చేస్తానని సోషల్ మీడియాలో వీడియోలు విడుదల చేస్తానని నిందితుడు మహేందర్ బెదిరింపులకు పాల్పడుతూ,పలుమార్లు లైంగిక దాడి చేయడం జరగింది.ఈ ఘటనలతో భయభ్రాంతులకు గురైన బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా, గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు దర్యాప్తు చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. కోటేశ్వర్ సమగ్రంగా విచారణ నిర్వహించి నిందితుడిని అరెస్ట్ చేసి, పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య వాదనలు వినిపించగా,కోర్టు సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు నరెడ్ల మహేందర్‌ను దోషిగా తేల్చి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష,6600 రూపాయల జరిమాన విధించింది.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మహిళలు,విద్యార్థినులు తమపై జరిగే వేధింపులు,అన్యాయాల గురించి నిర్భయంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని పోలీసులు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ,న్యాయ నిరూపణ వేగవంతగా జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.పై కేస్ లో నిందితునికి శిక్ష పడటం పడటం లో కృషి చేసిన పీపీ బిట్ల నర్సయ్య , ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ బి. కోటేశ్వర్, సి ఎంఎస్ ఎస్.ఐ శ్రీకాంత్ ,కోర్ట్ కానిస్టేబుల్ శ్రీధర్ సి ఎం ఎస్ కానిస్టేబుల్ రాజు,కిరణ్ లను జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఎస్ఆర్ఎస్ కాలువలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

-యువతీ,యువకుడు గల్లంతు

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



ఎస్ఆర్ఎస్పి కాలువలోకి ద్విచక్ర వాహనం దూసుకెళ్లి, యువతీ, యువకుడు గళ్ళంతైన సంఘటన మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది.పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన బోధాస్ గంగారం మంజుల దంపతులకు నలుగురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. చిన్న కూతురైనా బోధాస్ లావణ్య(21), మహారాష్ట్రకు చెందిన అంకోశ్ (22)లు గత కొన్ని రోజుల నుంచి ప్రేమ్నిచుకుంటున్నారు.ఆంకోశ్ మెట్పల్లిలో ఉన్న అక్క బావల వద్దకు గత 8నెలల క్రితం మహరాష్ట్ర నుంచి వచ్చి డ్రైవర్ గా పని చేసుకుంటూ ఇక్కడే ఉంటున్నాడు.కాగా ప్రేమికులైన లావణ్య ఆంకోస్ టీజి 18 4380 నంబర్ గల ద్విచక్ర వాహనంపై పెద్దాపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరంకు వెళ్లి, తిరిగి వెల్లుల్లకు బయలు దేరిన క్రమంలో ద్విచక్ర వాహనం వెనుక అంకోశ్ కూర్చోని లావణ్యకు డ్రైవింగ్ నేర్పుతున్నాడని,ఈ క్రమంలో పెద్దాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ ఒడ్డు వద్దకు వచ్చేసరికి ప్రమాదశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.వీరిని గమనించిన స్థానికులు వెంటనే కాలువలోకి దూకి కొట్టుకు పోతున్న వారిని కాపాడే ప్రయత్నం చేసినా,నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వారి ఆచూకి దొరకలేదు.సమాచారం అందుకున్న కోరుట్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి,గల్లంతయిన వారి ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టగా ద్విచక్ర వాహనం లభ్యమైంది.కానీ యువతీ యువకుడి ఆచూకీ మాత్రం దొరకక పోగా.. ఇరు కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

# ఉరి వేసుకుని మృతి

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



మండలంలోని ఎద్దులాపూర్ గ్రామానికి చెందిన అంబాల కుమార్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్న దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు డాక్టర్లు పరీక్షించి కుమార్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు మృతికి గల కారణాలు తెలియవలసి ఉంది అతనికి భార్య వసంత ఇద్దరు పిల్లలు ఉన్నారు

# ఆంధ్ర బస్సు ప్రమాదంలో రుద్రంగి మేస్త్రీ

కుటుంబ సభ్యుల ఆందోళన

రుద్రంగి ప్రభాతవార్త:



ప్రమాదం జరిగిన బస్సులో ప్రయాణిస్తున్న మేస్త్రి దేవాన్ల రాములు, గురువారం తెల్లవారుజామున ఆంధ్రలో ప్రమాదానికి గురైన బస్సులో రుద్రంగికి చెందిన మేస్త్రి దేవాన్ల రాములు ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాలు ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగుడు గ్రామానికి చెందిన దివాన్ల రాములు గత నాలుగు సంవత్సరాలుగా రుద్రంగిలో భవన నిర్మాణ పనులు చేపిస్తూ ఉన్నాడు. అతని కుటుంబం పులిగోడు విలేజ్లో ఉంటున్నారు. శ్రీరామనవమి వస్తుండడంతో బుధవారం స్వగ్రామం పునుగుడు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. రామయ్య కుమారుడు వేణు బస్ టికెట్ చేయడంతో ప్రమాదానికి గురైన పసులు బయలుదేరాడు. ప్రమాదం జరగడానికి 10 నిమిషాల ముందు కొడుకు వేణుతో ఫోన్లో మాట్లాడాడని ప్రమాదం జరిగినప్పటి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో ఏం జరిగిందో అని కుటుంబ సభ్యులు ఆందోళన గురవుతున్నారు. బస్సు దద్దమై మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో కూడా ఇవ్వడంతో మృతి చెందాడ లేదా అన్నది నిర్ధారిస్తామని పోలీసులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# లక్కీడ్రా పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులుపై కేసు

వెల్గటూర్ ప్రభాతవార్త :



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో లక్కీ డ్రా పేరుతో ప్రజల నుండి డబ్బులు వసూలు చేసిన ధర్మారం మండలానికి చెందిన కట్ట రమేష్ కళ్లెం నరేందర్ లపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మా అవసరం మీ అదృష్టం అనే పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా లక్కీ డ్రా నిర్వహిస్తున్నారు. అందులో గెలిచిన విజేతలకు పలు బహుమతులు అని ప్రకటిస్తూ ప్రజలకు మాయ మాటలు చెప్పి ప్రజల దగ్గర నుంచి ఒక్కో కూపన్‌కు 1116/, వసూలు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని సమాచారం మేరకు వారిని రాజారాంపల్లి గ్రామం వద్ద ఇద్దరినీ పట్టుకొని వారి వద్ద నుండి 3000 కూపన్లు 85 వేల నగదు రెండు సెల్ ఫోన్లు స్వాధీనపరుచుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు లక్కీ డ్రా నిర్వహించి ప్రజల నుండి మోసపూరితంగా డబ్బులు వసూలు చేస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడును ప్రజలు ఇలాంటి మోసపూరిత ప్రకటన పట్ల అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని అన్నారు ఈ సమావేశంలో సిసిఎస్ సిఐ ఎం శ్రీనివాస్ ఎస్ఐ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్

కోరుట్ల, ప్రభాతవార్త :

పట్టణంలోనిఅల్లమయ్య గుట్ట అర్బన్ హెల్త్ సెంటర్ లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాషేద్ ఉల్ అహద్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని సందర్శించి నిర్వహణ, వైద్య సేవలను పరిశీలించారు. శిబిరంలో గైనకాలజీ విభాగానికి డా.మాధవి, పీడియాట్రిక్స్‌కు డా. భూమేశ్వర్, నేత్ర వైద్యానికి డా.నేహా తబ్బాసుమ్, డా. స్వాతి లక్ష్మణ్ వైద్య సేవలు అందించారు. జనరల్ మెడిసిన్ విభాగంలో డా.నివేదిత, దంత వైద్య విభాగం లో డాక్టర్. లక్షీ ్మ రోగులను



పరీక్షి ంచి చికిత్స అందించారు.అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలుడా. స్వాతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించగా, స్థానిక ప్రజలు తరలివచ్చి వైద్య సేవలను వినియోగించుకున్నారు. రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష ్యమని తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిరుమల గంగాధర్, హెల్త్ ఎడ్యుకేటర్లు తులసి రమణ, ధనుంజయ, పీహెచ్ఎం ఎంఏ.మాజీద్, ల్యాబ్ టెక్నీషియన్లు రమ్య, సాజీద్ అలీ, కౌన్సిలర్ మల్లికార్జున్, ఎస్ ఎస్ కే మేనేజర్ సంతోష్, ఎన్జీవో ప్రతినిధులు నాగరాజు, శంకర్,ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.




## గ్లోబల్ హైట్స్ స్కూల్లో శ్రీరామనవమి వేడుకలు

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్ల గల గ్లోబల్ హైట్స్ ఈ టెక్నో స్కూల్లో శ్రీరామనవమి సందర్భంగా ప్రీ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీరాముడు, అన్నదమ్ముల యొక్క విలువలు కుటుంబ విలువలు, భారతదేశ యొక్క చరిత్రను పిల్లలకు వివరించారు. రాజు ఎలా ఉండాలో ఎలాంటి ఆదర్శ పాలన చేయాలో వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గట్ల లక్షి ్మ, అకాడమిక్ డైరెక్టర్ గట్ల ప్రకాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీడీ టేకదారులకు కమిషన్ రేటు పెంచాలి

కోరుట్ల, ప్రభాతవార్త :



రాష్ట్రంలోని బీడీ పరిశ్రమల్లో పనిచేసే బీడి టేకదారులకు కమిషన్ రేటు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సి ప్రభాకర్ భవన్లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బీడీ పరిశ్రమల యజమానులకు కార్మికులకు మధ్య వారధిగా ఉంటారన్నారు. కార్మికుల నుంచి సేకరించినా బీడీలను తీసుకువచ్చి బీడీ సెంటర్ల లోని కార్ఖానాకు అందించడంలో ప్రధాన పాత్ర బీడీ కేకదారులు పోషిస్తారన్నారు.తెలంగాణ జిల్లాలలోని దేశాయ్ బ్రదర్స్ బీడీ, టెలిఫోన్, శివాజీ, చారు బాయ్, సీజే పటేల్, ఠాగూర్ , హెచ్ పి బీడీ పరిశ్రమల్లో సుమారు 20,000 మంది బీడీ టేకదారులు పనిచేస్తున్నారనీ, వెయ్యి బీడీలకు కమిషన్ రేటు రూ .22 మాత్రమే యజమానులు చెల్లిస్తారని పేర్కొన్నారు. రవాణా భారం ఖర్చు పెరిగిపోవడంతో ఏకదారుల కమిషన్ను పెంచాలని బీడీ పరిశ్రమ యజమానుల సంగం అధ్యక్ష కార్యదర్శులు జితేంద్ర భాయ్ ధర్మేంద్ర గాంధీ లకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీడీ కార్మిక సంఘం నేతలు ఏఐటీయూసీ, వివిధ జిల్లాల నాయకులు బి గోవర్ధన్, అయ్యావార్ల లక్ష ్మణ్, అనుమల్లా గంగాధర్, ఆరే రంగారెడ్డి, భాను ప్రసాద్, కె.వి అనసూయ, ఎండి ముక్రం, కొక్కుల శాంత, ఎండి మోలానా పాల్గొన్నారు

## కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వెంటనే చేపట్టాలి

**అసెంబ్లీలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

మల్యాల, ప్రభాతవార్త



ఉత్తర తెలంగాణ లోనే ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం కు సరైన నీటి వసతి లేక ఇక్కడికి వచ్చే భక్తులు ఇక్కట్లు పడుతున్నారని, ఆలయంలో నిరంతరం నీటి వసతి అందుబాటులోకి తీసుకురావడానికి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులు చేపడాల్సి ఉందని , ఇందుకు సంబంధించిన రివైజ్ ఎస్టిమేషన్లు ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్నాయని వెంటనే కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గురువారం అసెంబ్లీలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు, కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పూర్తి అయితే పక్కనే ఉన్న 2 వేల మంది విద్యార్థులు చదువుతున్న నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలకు కూడా నీటి వసతి మెరుగుపడుతుందన్నారు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు

## రామకృష్ణ విద్యార్థికి ఉత్తమ పరిశోధనపత్రం

కోరుట్ల, ప్రభాతవార్త :



శాతవాహన యూనివర్సిటీ వికసిత్ భారత్2047 జాతీయ సదస్సులో మొదటి రోజు ఇచ్చిన ప్రజెంటేషన్ లో జగిత్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుహానా కౌసర్ నీ ఉత్తమ ప్రజెంటేషన్ గా ఎంపిక చేసి అట్టి ఉత్తమ ప్రెసెంటేషన్ అవార్డును శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి చేతుల మీదుగా విద్యార్థికి అందించి ప్రత్యేకంగా అభినందించారు.కామర్స్, బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల పరిధిలోని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో "వికసిత భారత్ 2047 లక్ష ్య సాధనలో కామర్స్, మేనేజ్మెంట్ యొక్క మార్పు దోహదం" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపులో శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్ దేశ ఆర్థికాభివృద్ధిలో కామర్స్, మేనేజ్మెంట్ రంగాల ప్రాధాన్యతను వివరించారు. ఇట్టి జాతీయ సదస్సులో పాల్గొన్న అధ్యాపకులను, ఉత్తమ ప్రజెంటేషన్ అందించిన రామకృష్ణ డిగ్రీ కళాశాల అధ్యాపకులను కూడా అభినందించారు. ప్రజెంటేషన్ ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో ఉన్నటువంటి నైపుణ్యాలను వెలికితీస్తూ రాబోయే రోజుల్లో గ్లోబలైజేషన్లో వచ్చే సవాళ్లను ఎదుర్కొని దానికి పరిష్కారం చూపే విధంగా తయారవుతారని,ఉత్తమ ప్రజెంటేషన్ అందించిన జగిత్యాల సుహానా కౌసర్ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి విద్యార్థులతో పాటు పరిశోధకులు, అకాడమిక్ వర్గాలు కీలక పాత్ర పోషించాలన్నారు. కీనోట్ స్పీకర్గా భారత కామర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ రవి కుమార్ జాస్తి పాల్గొని, ఆధునిక వ్యాపార ధోరణులు, డిజిటల్ మార్పులు, గ్లోబల్ మార్కెట్ సవాళ్లను అధిగమించడంలో మేనేజ్ మెంట్ నైపుణ్యాల అవసరాన్ని వివరించారు.ఈ సదస్సు లో ఉపకులపతి ఆచార్య సోమేశ్ కుమార్, రిజిస్టర్ పి సతీష్ కుమార్, కామర్స్ విభాగ డీన్ ఏ. రవి, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ డి.హరికాంత్ పాల్గొన్నారు.

## శ్రీ సాయిరామ ఆలయంలో హుండీ లెక్కింపు

కోరుట్ల, ప్రభాతవార్త :

కోరుట్ల పట్టణంలోని శ్రీ సాయిరామ దేవాలయంలో హుండీ లెక్కింపు గురువారం జరిగింది. హుండీ లెక్కింపులో రూ. 92వేల 530 ఆలయానికి ఆదాయాన్ని సమకూరింది. దేవాదాయశాఖ పరిశీలకులు రాజమోళి, కార్యనిర్వహణాధికారి, ఆలయ రీన్వేషణ్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.



## వార్డు మెంబర్లకు ముగిసిన శిక్షణ తరగతులు

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



కోరుట్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్లకు గత ఐదు రోజుల నుండి నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ శిక్షణలో భాగంగా వార్డు మెంబర్లకు పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీకి సంబంధించిన పరిపాలన పాత్ర, భాద్యతలపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ లు పంపిణి చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ , ఎంపీవో రాజశేఖర్ , టిఓటి లు అపర్ణ, పూజిత , రవీందర్, ఆదిరెడ్డి, వివిధ గ్రామాల వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయం ఆకస్మిక తనిఖీ

కథలాపూర్, ప్రభాతవార్త :

మండలంలోని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్. లత కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహణ విధానం, రికార్డుల సంరక్షణపై సమీక్ష నిర్వహించారు.ప్రత్యేకంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులతో సమీక్షి స్తూ, మ్యాపింగ్ పనుల పురోగతి, భూసేకరణ సంబంధించిన వ్యవహారాలు, భూ భారతీ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల అప్డేట్ పై వివరాలు తెలుసుకున్నారు.పెండింగ్‌లో ఉన్న అన్ని భూ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. భూ రికార్డుల నిర్వహణ పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 26, ప్రభాతవార్త



జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ సత్యనారాయణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని, ఈ మేరకు మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సి.ఎస్.ఆర్. నిధుల నుండి 2 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో నిరంతరం త్రాగునీటిని సరఫరా చేసేందుకు పనులు కొనసాగుతున్నాయని, ముల్కల్ల నుండి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సమృద్ధిగా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 202627 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ 32 కోట్ల 42 లక్షల రూపాయల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 4 కోట్ల 77 లక్షల రూపాయలు సాధారణ ఆదాయం ( గ్రాంట్లు కాకుండా), 26 కోట్ల 28 లక్షల రూపాయల గ్రాంట్లు, 81 లక్షల రూపాయల డిపాజిట్లు, అడ్వాన్సులు, 55 లక్షల రూపాయల నిలువ ఉంటుందని తెలిపారు.

### జాతీయ రహదారి విస్తరణలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

జాతీయ రహదారి 63 విస్తరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండలం తిమ్మాపూర్ ప్రాంతంలో ఆర్మూర్ నుండి చంద్రాపూర్ జాతీయ రహదారి 63 పనులను మండల తహసిల్దార్ సతీష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను నిబంధనలకు లోబడి చేపట్టేలా అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షి ంచాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నివాసాల నుండి సేకరించిన చెత్తలో ఉపయోగకరమైన వాటిని వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

బాలసదనం భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో చేపట్టిన బాలసదనం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మనుగడపై ఆందోళన

**ఐక్య ఉద్యమానికి పిలుపు**

గోదావరిఖని, ప్రభాత వార్త:



సింగరేణి సంస్థ మనుగడ ప్రమాదంలో పడుతోందని, కార్మికుల ఉద్యోగ భద్రత, హక్కులను కాపాడేందుకు అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు రావాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గోదావరి పరివాహక ప్రాంతంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ కొత్త గనుల అభివృద్ధికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని ఆయన విమర్శించారు.కొత్తగూడెంలోని ఐఎఫ్టియు కార్యాలయంలో ఐ.కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి బొగ్గుగనుల విక్రయాలు సంస్థ భవిష్యత్తుకు ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేలం ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతించడం సంస్థను సజీవ సమాధి చేయడమేనని పేర్కొన్నారు.యాజమాన్యం కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్బంధ చర్యలు చేపడుతోందని ఆరోపించారు. సేఫ్టీ ప్రమాణాలను విస్మరించడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, శాశ్వత అనారోగ్యంతో ఉన్న కార్మికులను కూడా మెడికల్ బోర్డు ఫిట్‌గా ప్రకటించడం అన్యాయమని అన్నారు. ఈ అంశంపై కోర్టు కూడా యాజమాన్యం వైఖరిని తప్పుపట్టిందని గుర్తుచేశారు.మెడికల్ ఫిట్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని, కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి, బెల్లంపల్లి ప్రాంతాల్లో కొత్త గనులను సింగరేణి ఆధ్వర్యంలోనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.సింగరేణి మనుగడ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గత పది నెలలుగా ఐక్య ఉద్యమం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎఐటీయూసీ చేపడుతున్న జాతాకు మద్దతు తెలుపుతూ, అన్ని సంఘాలు కలిసివచ్చి బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.సమావేశంలో జనరల్ సెక్రెటరీ జే. సీతారామయ్యతో పాటు ఏ. వెంకన్న, ఎండి. రాసుద్దీన్, డి. బ్రహ్మానందం, ఈదునూరి రామకృష్ణ, కాపు కృష్ణ, తోట్ల రాయమల్లు, సంతు, సంజీవరావు, నాసర్ పాషా, ఈ. నరేష్, జి. నాగేశ్వరరావు, రాజేశం, తోడేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓదెల వారసంత 30న బహిరంగ వేలం

ఓదెల,ప్రభాతవార్త:



ఓదెల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ (శ్రీ పార్వతి శంభు లింగేశ్వర స్వామి ఆలయం) వద్ద ప్రతి గురువారం వారసంత నిర్వహిస్తారు ఈ వారసంత వేలం నిర్వహించుటకు గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేశారు ఈ సందర్భంగా ఓదెల సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాట్లాడుతూ ఈ నెల మార్చి 30న సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరనలో వారసంత కు బహిరంగ వేలం నిర్వహించబడునని ఈ వేలంకు ఆఫ్ సెట్ ధర 68 వేల 640రూపాయలు వేలంలో పాల్గొనేవారు సోమవారం ఉదయం 10గంటల లోపు 5000ల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసినట్లు సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ కార్యదర్శి వెంకట లక్ష్మణ్ వార్డు సభ్యులు అప్పని తిరుపతి,రాపెల్లి రాజయ్య, కొండ్ర లక్ష్మణ్ తో పాటు గోపతి ప్రవీణ్, బుద్దే రవి తదితరులు పాల్గొన్నారు

# సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. గురువారం రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెట్రోల్, డీజిల్ నిల్వలపై అంబర్ కిషోర్ ఝా స్పష్టతనిచ్చారు. ఇంధన కొరత ఉందనే వదంతుల కారణంగా ప్రజలు వాహనాల్లో ఫుల్ ట్యాంక్ చేయించు కుంటూ, అదనంగా నిల్వ చేసుకుంటున్నారని, దీనివల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతు న్నాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని వివరించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేయవద్దని కోరారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ప్రశాంతంగా ఉండాలని అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు.

# వీధి వ్యాపారులు పీఎం స్వా నిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

**ఎంపీడీవో శైలజ రాణి**

రామగిరి ప్రభాతవార్త

రామగిరి మండలం లోని పన్నూరు గ్రామపంచాయతీ పీఎం స్వ నిధి స్కీమ్ కింద ఎంపిక అయిందని ఎంపీడీవో శైలజ రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నూరు గ్రామ సంతలో చిరు వ్యాపారులు చేసుకునేవారు పీఎం స్వ నిధి పథకం కింద మూడు విడుత లలో బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని కావున అర్హులైన చిరు వ్యాపారులు ఈ నెల 31 లోపు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు**

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు అన్నారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ ఏసిపి సిహెచ్. శ్రీనివాస్ సూచనల ప్రకారం గురువారం స్థానిక లక్ష్మీ నగర్ ఏరియాలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అరైవ్ అలైవ్ 2026 మూడవ దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మార్చి 25 నుండి 31 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు కుడి వైపు నుండి మాత్రమే ఓవర్ టేక్ చేయాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని వర్తక వ్యాపారులకు, ప్రజలకు సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనం నడపరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు జి. హరి శేఖర్, ఎన్. రామరాజు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కురుమ సోదరుల సాంప్రదాయ ఆచారాలకు రక్షణ కల్పించాలి

### ◗శాసన సభ జీరో అవర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విజ్ఞప్తి

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



రాష్ట్రంలోని కురుమ సోదరులు తరతరాలుగా పాటిస్తున్న సాంప్రదాయ ఆచారాలకు ప్రభుత్వ రక్షణ కల్పించాలని కొరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అసెంబ్లీ వేదికగా జీరో అవర్ లో గురువారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ..కురుమ సోదరుల జీవనశైలి, వారి ఆచారాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఐదేళ్లకొకసారి కురుమలు తమ కులదైవమైన బీరప్ప స్వామి కళ్యాణం ఎంతో వైభవంగా నిర్వహిస్తారని, ఇది వందల ఏళ్లుగా వస్తున్న ఆచారమని గుర్తుచేశారు. కళ్యాణంలో భాగంగా నిర్వహించే గావు పట్టడం అనే సంప్రదాయంపై అవగాహన లేక కొంతమంది యానిమల్ రైట్స్ యాక్టివిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని, దీనివల్ల అమాయక కురుమలపై కేసులు నమోదవుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. అడవిలో గొర్రెలను కాస్తూ సమాజానికి సేవలం దించే కురుమలు శాంత స్వభావులని, ఇలాంటి కేసుల వల్ల వారు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇకనైనా కురుమల ఆచారాలకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, దీనిపై అసెంబ్లీలో లఘు చర్చ నిర్వహించి, వారికి తగిన భరోసా కల్పించాలని డాక్టర్ సంజయ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం స్పీకర్ స్పందిస్తూ, ఎమ్మెల్యే సంజయ్ లేవనెత్తిన ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## మెట్‌పల్లి వార్త

## అంగన్వాడి కేంద్రంలో శ్రీమంతాలు నిర్వహణ

మెట్‌పల్లి అర్బన్, ప్రభాతవార్త :



పట్టణంలోని అంగన్‌వాడి కేంద్రంలో శ్రీమంతం కార్యక్రమం నిర్వహించబడింది. గురువారం ఆల్ఫ్ట్ సమావేశం నిర్వహించిన అనంతరం గర్భిణీ స్త్రీలకు 25వ వార్డు కౌన్సిలర్ ఆశ్రా ఫర్వీన్ జావేద్ శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టిక ఆహార పట్ల ఆరోగ్య విషయాల పట్ల పాలు సూచనలు చేసి ఆరోగ్యంగా ఉండాల్సిందిగా బాలింతలను, గర్భిణులను, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ సూచనలు చేశారు. ఆరోగ్య లక్షి ్మ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసు కోవాలని కోరారు, ప్రతిరోజు ఒకపూట భోజనం అంగన్‌వాడి కేంద్రంలోనే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రా ఫర్వీన్ జావేద్ వార్డు కౌన్సిలర్, సి హెచ్ . ప్రతిభ సూపర్వైజర్, యం .పద్మ అంగన్‌వాడి టీచర్, గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి నిలువుటద్దం హెడ్ కానిస్టేబుల్ నల్లాల లక్ష్మీరాజం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లాల లక్షి ్మరాజం ఆకస్మిక మరణం జిల్లా పోలీస్ శాఖకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. విధి నిర్వహణలోనే కాకుండా, మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి మరో ఇద్దరికి ప్రాణదాతగా నిలిచిన ఆయన, పోలీస్ అంటే కేవలం రక్షణ మాత్రమే కాదు, మానవత్వానికి ప్రతీక అని మరోసారి చాటిచెప్పారు. ఇలాంటి దుఃఖ సమయంలో కూడా ఆయన భార్య శ్రీమతి రాధ గారు చూపిన ధైర్యం, తీసుకున్న గొప్ప నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. భర్త మరణంతో పుట్టెడు శోకంలో ఉన్నప్పటికీ, ఆయన అవయవాలను దానం చేయాలని ఆమె తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రశంసనీయమైనది. లక్ష్మీరాజం గారి రెండు కిడ్నీలను దానం చేయడం ద్వారా ఇద్దరు వ్యక్తులకు పునర్జన్మ లభించి, వారి కుటుంబాల్లో ఆనందం నింపింది. మరణించినా మరొకరి రూపంలో జీవించడం కంటే గొప్ప సాఫల్యం మరొకటి లేదని ఈ సంఘటన స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, లక్ష్మీరాజం మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన చేసిన అవయవ దానం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## పర్యావరణం పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలి

### -జేఎన్టీయూ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

రామగిరి ప్రభాతవార్త



పర్యావరణం పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ బి విష్ణువర్ధన్ అన్నారు. తెలంగాణ గ్రీన్ నేషనల్ కార్ప్స్ ఆదేశాల మేరకు మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేస్ట్ టు హెల్త్ క్రియేషన్, క్యాంపస్ ఇకో బజార్ కార్యక్రమంలో భాగంగా గురువారం వ్యర్థ పదార్థాలతో అందమైన, ఆకర్షణీయమైన వస్తువులను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శనగా పెట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ ఇంట్లో అలంకారంగా ఉపయోగపడేలా డెకరేటివ్ వస్తువులను తయారు చేయడం పట్ల విద్యార్థులను అభినందించారు. పర్యావరణంపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని, వ్యర్థ పదార్థాలను అద్భుతంగా తయారు చేయవచ్చని విద్యార్థులు నిరూపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి చినాల సుమన్, కార్యక్రమాల ఇంచార్జి కావ్య, కమిటి సభ్యులు శ్రీధర్, రాజేశ్ కుమార్, మహిపాల్ శివకృష్ణ, వంశీకృష్ణ, దీక్షిత్, పింగిళి కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి ఏద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### జెడ్పి సీఈవో కాసర్ల నరేందర్

రామగిరి ప్రభాతవార్త:



గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జెడ్పి సీఈవో కాసర్ల నరేందర్ అన్నారు. గురువారం రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ను ఆయన సందర్శించారు. వేసవి కాలములో త్రాగు నీటి ఎద్దడి నివారణా చర్యలలో భాగముగా తీసుకోవాల్సి న చర్యల గురించి, అందుకు సంభందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో తీసుకోవాల్సి న పనుల గురించి వివరించారు. అలాగే మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బద్రి శైలజ రాణి, సూపరింటెండెంట్ దేవరకొండ ఉమేష్, ఆర్ డబ్ల్యూఎస్ శృతి, పిఆర్ ఏఈ వరలక్షి ్మ తదితరులున్నారు.

## రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేయాలి

### పిఎసిఎస్ ఇన్చార్జి మోరే శ్రీనివాస్

రామగిరి ప్రభాతవార్త:



రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి వ్యవసాయ సహకార పరపతి సంఘం బలోపేతం కావడానికి కృషి చేయాలని అఫీషియల్ పర్సన్ ఇంచార్జ్ మోరే శ్రీనివాస్ అన్నారు. గురువారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో వార్షిక బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానిటరింగ్ అధికారి పాకాల సురేందర్ రెడ్డి మరియు శ్రీనివాస్ మాట్లాడుతూ 40.99 సంఘానికి నికర లాభం వచ్చిందని పేర్కొన్నారు. ఆర్థిక పురోగతి 2024 25 లో 40.99 లాభాన్ని గణించినట్లు తెలిపారు. రైతులు తమ సాగు రుణాలు గడువులోగా రెన్యువల్ చేసుకోవాలని అలాగే దీర్ఘకాలిక రుణాల బకాయిలు, సకాలంలో చెల్లించి సంఘం ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి తోడ్పడాలని కోరారు. రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వారా రైతులకు కలిగే లాభాలను వారి వివరించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు సామూహిక మార్కెటింగ్ ద్వారా రైతులకు ఆర్థిక వెసులుబాటు కలిగిస్తుందని పేర్కొన్నారు. 12 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా గత ఖరీఫ్ సీజన్లో 30.64 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు రాబోయే రబీ సీజన్లో కూడా వరి ధాన్య కొనుగోలు కేంద్రాలకు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోనే ఆదర్శవంతంగా కమాన్ పూర్ పిఎసిఎస్ నడుస్తుందని నివేదిక ప్రకారం సంఘం బ్యాంకు డిపాజిట్లు 50.68 లక్షలు కలిగి ఉండడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ కుమార్, రొంపి కుంట సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్, తోపాటు అడువాల చంద్రయ్య, పిడుగు నరసయ్య, సిబ్బంది రవీందర్, కుమార్, సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 31న జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

### జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్

పెద్దపల్లి, ప్రభాతవార్త:

ఈ నెల 31న జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఎ. సురేష్ మాట్లాడుతూ తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు అర్హులని వెల్లడించారు. మార్చి 31 మంగళవారం ఉదయం 10 గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ ఐటిఐ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తామని, ఎంపికైన వారు నిర్ణీత సమయానికి చేరుకోవాలని సూచించారు. ఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికేట్, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, తాజా కుల ధృవీకరణ పత్రం ఒరిజినల్ మరియు జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు. 4వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు 01092017 నుండి 31 082018 మధ్య జన్మించి ఉండాలని, 31082026 నాటికి వయస్సును పరిగణనలోకి తీసుకుంటామని ఎ. సురేష్ వివరించారు.



సిరిసిల్ల వార్త

# ఏప్రిల్ 1 నుంచి మన ఇసుక వాహనంతో సరఫరా

**ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి**
**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇబ్బందులు రావద్దు**
**ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం**

**సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త**

:రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చే నెల (ఏప్రిల్) ఒకటో తేదీ నుంచి మన ఇసుక వాహనం ద్వారా నిర్మాణ పనులకు ఇసుక సరఫరా అవుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం, ఇసుక సరఫరా తదితర అంశాలపై జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక సరఫరా చేయాలని సూచించారు. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు రావద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని,



ఆయా ఇసుక రీచ్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఇటుక ఇటుక బట్టీలు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలోనే ఇసుక సరఫరా చేయాలని ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం నిఘా పెడతామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీఎస్పీ నాగేంద్రచారి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, నీటి పారుదల, భూగర్భ జల, అధికారులు, తహసీల్దార్లు, ఎస్ హెచ్ ఓ లు తదితరులు పాల్గొన్నారు

## 10 నెలలుగా అందని మజూరీ

**తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.**

.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీడీ కార్మికుల కష్టార్జితాన్ని ఠాకూర్,సాదీకర్ కంపెనీల యాజమాన్యాలు ఎగ్గొట్టడాన్ని నిరసిస్తూ బీడీ టెకేదారులు రణభేరి మోగించారు.గత 10 నెలలుగా రెక్కలు ముక్కలు చేసుకుని బీడీలు చుట్టిన వేలాది మంది కార్మికులకు మజూరీ డబ్బులు చెల్లించకపోవడంతో బుధవారం సిద్దిపేట రేంజ్ కార్యాలయం వద్ద బీడీ టెకేదార్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్రిక్త పరిస్థితుల నడుమ ధర్నా నిర్వహించారు. కార్మికుల గోడును వినేందుకు సిద్దిపేట రేంజ్ అధికారి కనీసం అందుబాటులో లేకపోవడంపై నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ముందస్తుగా ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి,మా సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నామని తెలిపినప్పటికీ అధికారి మొహం చాటేయడం అత్యంత దురదృష్టకరం" అని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కార్మికుల ఆకలి కేకలను పట్టించుకోకపోవడం ఏంటని వారు నిలదీశారు.ఈ సందర్భంగా బీడీ టెకేదార్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల దశరథం,ప్రధాన కార్యదర్శి బొల్లి రాజు మాట్లాడుతూ 10 నెలలుగా వేతనాలు అందక కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లా



కలెక్టర్కు,జిల్లా లేబర్ ఆఫీసర్కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా యంత్రాంగంలో చలనం లేదని వారు విమర్శించారు.తక్షణమే కార్మికుల అకౌంట్లలో డబ్బులు జమ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. యజమాన్యాలు, అధికారులు మొండివైఖరి వీడకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో తంగళపల్లి, సిరిసిల్ల కు చెందిన టెకేదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాజమాన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఎండిపోతున్న పంట పొలాలు కంట తడి పెడుతున్న అన్నదాతలు



**ముస్తాబాద్ ప్రభాత వార్త:**

గన్నేవాని పల్లె గ్రామానికి చెందిన మామిండ్ల లింగం తనకున్న 5 ఎకరాలలో వరి సాగు చేస్తున్నాడు.బోర్లు ఎత్తిపోయి ఆరుగాలం పండించిన పంట ఎండిపోయింది.గతములో నక్కవాగు నుండి నీరు వచ్చేది.ఈసారి నక్కవాగు నుండి వచ్చే నీరు అందక 70 ఎకరాలకు పంట నష్టం వాటిల్లింది.ఎండిపోయిన పంట పొలాలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించకపోతే రైతుల ఆత్మహత్యలు చవి చూస్తారని మామిండ్ల లింగం అన్నారు.

## గుండ్లసింగారంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**ఎడ్యుకేషన్ కేయూ, మార్చి 26 ప్రభాతవార్త**

:కేయూ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-I, అండ్ II ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా గుండ్లసింగారం గ్రామంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.రమణ మార్గదర్శకత్వంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.డి.శైలజ, డా.ఎం.సౌజన్య పర్యవేక్షణలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి సంరక్షణ, వృక్షారోపణ వంటి అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా గ్రామ ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచారు. సర్వేనిర్వహించి, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు.

## వేసవిలో త్రాగునీటి ఏద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**రామగిరి ప్రభాతవార్త :**

త్రాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జెడ్పి సీఈవో కాసర్ల నరేందర్ అన్నారు. గురువారం రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ను ఆయన సందర్శించారు. వేసవి కాలములో త్రాగు నీటి ఎద్దడి నివారణా చర్యలలో భాగముగా తీసుకోవాల్సిన చర్యల గురించి, అందుకు సంభందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో తీసుకోవాల్సిన పనుల గురించి వివరించారు. అలాగే మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ది పనులు గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బద్రి శైలజ రాణి,సూపరింటెండెంట్ దేవరకొండ ఉమేష్,ఆర్ డబ్ల్యూఎస్ శృతి, పిఆర్ ఏఈ వరలక్ష్మి తదితరులున్నారు.

## మాట నిలబెట్టుకున్న ఓదెల శ్రీలత భాస్కర్

**నడికుడ, మార్చి 26(ప్రభత వార్త ):**

ఎన్నికల సమయంలో గెలిచేందుకు ఏవేవో చెబుతారు. అవి చేస్తాం.. ఇవి చేస్తాం.. అని హామీ ఇస్తారు. గెలిచి కుర్చీ ఎక్కాక హామీ గురించి అడిగితే సాకులు చెబుతారు. ఇదీ.. రాజకీయ నాయకులపై ప్రజలకున్న నిశ్చితాభిప్రాయం. చాలా మంది హామీలను విస్మరిస్తారు. అందుకే ఈ పరిస్థితి. కానీ 'నూటికో కోటికో ఒక్కరు' అన్నట్టుగా కొందరు మాటమీద నిలబడతారు. ఆరు నూరైనా.. చెప్పిన పని చేస్తారు. ఆ కోవలోని వ్యక్తి కొకొండ గ్రామ సర్పంచ్ ఓదెల శ్రీలత భాస్కర్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఆమె.. ఎన్నికల సమయంలో తాను గెలిస్తే గ్రామంలో ఉన్న నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పాత పైప్ లైన్ స్థానంలో నూతన పైప్ లైన్ నిర్మిస్తానని ఊరి ప్రజలకు హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ అధికారంలో లేదు. అయినా ఆమె మాటలను గ్రామస్తులు నమ్మి గెలిపించారు. ఇచ్చిన మాట ప్రకారం.. సర్పంచ్ వీధిలైట్లు పారిశుద్ధ పనులు ప్రతి వార్డులో ఎలాంటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. నాలుగో వార్డులో 250 మీటర్ల పైప్ లైన్ పనులు ఆమె ప్రారంభించారు.

## రామాలయంలో స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



శ్రీరామ నవమి పురస్కరించుకొని మండలంలోని రామోజీపేట గ్రామంలో గల శ్రీ సీతారామ స్వామి కళ్యాణ నిమిత్తం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ సతీమణి విద్య గురువారం పట్టు వస్త్రాలు సమర్పించారు.ఉదయాన్నే సతీ సమేతంగా చేరుకున్న ఆయన ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.రామోజీపేట సీతారాముల స్వామికి ప్రత్యేకత ఉందన్నారు.ఈ సందర్భంగా అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందించారు

## గవర్నర్ ని కలిసిన చేనేత కళాకారుడు హరిప్రసాద్

**సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :**



సిరిసిల్ల పరిణానికి చెందిన చేనేత కళాకారుడు వెల్డి హరిప్రసాద్ గురువారం హైదరాబాదులో గవర్నర్ శివప్రసాద్ శుక్లా ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేత కార్మికుల సమస్యలను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ సమస్యలను హరిప్రసాద్ వివరించారు. అనంతరం హరిప్రసాద్ నేసిన జి20 లోగో, అగ్గిపెట్టెలో చీర, తయారు చేశానని తెలిపారు. గవర్నర్ శివ ప్రకాష్ శుక్లాకు వెదురుతో చేసిన సిరిసిల్ల మరమగ్గం జ్ఞాపికను హరిప్రసాద్ బహుకరించారు

## బాధిత కుటుంబానికి అండగా సర్పంచులు

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండలంలోని రంగపేటలోబుధవారం తన కుమారుడు దుర్మట్ల విగ్నేష్ తో పాటు రేఖ బావిలోదూకి ఆత్మహత్య చేసుకొని మరణించిన కుటుంబ సభ్యులకు ఇల్లంతకుంట, రంగంపేట గ్రామాల సర్పంచ్ లు రాజు,భాస్కర్ రెడ్డి లు గురువారం అండగా నిలిచారు.సాయంత్రం జరిగిన దహన సంస్కార కార్యక్రమాల్లో పాల్గొని నివాళులు అర్పించారు.కుమారునితో పాటు తల్లి బావిలో దూకి మరణించిన ఘటన అత్యంత బాధాకరం అన్నారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# సైబర్ మోసలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలి

**-సైబర్ క్రైమ్ డిఎస్పి వెంకటరమణ**
**-డిగ్రీ గురుకుల విద్యార్థినులకు**
**సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం**

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:





సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి సైబర్ క్రైమ్ డిఎస్పి వెంకటరమణఉమెన్ ఎంపవర్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా గురువారం జగిత్యాల ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డిఎస్పి వెంకటరమణ మాట్లాడుతూ.. మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న వివిధ రకాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్ వంటి సమస్యలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయని, సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్స్ ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపడం, వేధించడం, బెదిరించడం వంటి చర్యలు సైబర్ నేరాల పరిధిలోకి వస్తాయని వివరించారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.అలాగే ఫేక్ సోషల్ మీడియా ప్రొఫైల్ల ద్వారా జరుగుతున్న మోసాలపై కూడా అవగాహన కల్పించారు. ఇతరుల పేరుతో నకిలీ ఖాతాలను సృష్టించి డబ్బులు అడగడం, వ్యక్తిగత వివరాలు సేకరించడం వంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. విదేశాల్లో ఉద్యోగం, గిఫ్ట్ పంపిస్తున్నామని చెప్పి డబ్బులు అడిగే మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.అదేవిధంగా ఫిషింగ్ లింకులు పంపించి డేటా దొంగిలించడం, ఓటీపీలు తీసుకోవడం వంటి సైబర్ మోసాల గురించి కూడా వివరించారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్వర్డ్లు ఉపయోగించడం, ప్రైవసీ సెట్టింగ్స్ను సరిచేసుకోవడం, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 హెల్ప్లైన్ నంబర్కు కాల్ చేయాలని, అలాగే వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. సైబర్ నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ విద్యార్థినులతో సైబర్ క్రైమ్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్.ఐ ఉమాసాగర్ సైబర్ క్రైమ్ ఎస్.ఐ లు కృష్ణ, దినేష్, ఎస్ కే ఎన్ ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ , గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత, కళాశాల సిబ్బంది, కళా బృంద సభ్యులు , షి టీం ,బరోసా టీం సిబ్బంది మరియు సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# జగిత్యాల వార్త



## జీవన్ రెడ్డికి మద్దతుగా వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజీనామా

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి పట్ల పార్టీలో జరుగుతున్న వివక్షకు నిర సనగా రాజీనామాల పర్వం కొనసాగు తోంది.జీవన్ రెడ్డికి సంఘీభావంగా వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గుండాటి గోపిక రెడ్డి తన పదవికి ,పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.ఈ సందర్భంగా గోపిక రెడ్డి మాట్లాడుతూ,గత నాలుగు దశాబ్దాలుగా జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం, కార్యకర్తలను ఐక్యంగా ఉంచడం కోసం జీవన్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.అటువంటి సీనియర్ నాయకుడి పట్ల పార్టీలో వివక్ష చూపడం,వారి గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించడం వల్ల ఆయన తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకుడికే రక్షణ లేని చోట తాను కొనసాగలేనని స్పష్టం చేస్తూ,తన రాజీనామా లేఖను రాష్ట్ర అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్కు పంపినట్లు వెల్లడించారు.జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన నేపథ్యంలో, ఆయనకు మద్దతుగా తాను కూడా పార్టీని వీడుతున్నట్లు ఆమె ప్రకటించారు.

# ఆకాశమే హద్దుగా సంబరాన్ని నింపిన అల్ఫోర్స్ పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు

**◆పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్,సమీండ్ల వాణి శ్రీనివాస్**
**◆అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి**

జగిత్యాల అర్బన్ ప్రభాత వార్త:





పట్టణంలో కృష్ణానగర్, విద్యానగర్ అల్ఫోర్స్ పాఠశాలల విద్యాసంస్థల పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు విద్యార్థులకు క్రమశిక్షణ పట్లూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మరియు క్రమశిక్షణ ద్వారా విద్యార్థులకు ఎన్నో అవకాశాలు వస్తాయని మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్,అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేతతో కలిసి స్థానిక జగిత్యాల లోని ఒక వేడుక మందిరంలో ఫూజన్ పేరుతో నిర్వహించినటువంటి పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమం తప్పకుండా విషయాలను తెలపాలని మరియు విషయాలలో పట్టు సాధించే విధంగా సాధన చేపించాలని వారు చెప్పారు. నేడు ప్రపంచంలో చదువుకున్న వారికి చాలా విలువ ఉన్నదని మరియు వారికి ఇచ్చే ప్రాముఖ్యత వేరే వారికి ఉండదని వారు చెప్పారు. విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా గత 36 సంవత్సరాలుగా విద్యారంగానికి విశిష్టమైన సేవలు అందిస్తున్నామని మరియు వివిధ రంగాలలో సంచలనాత్మక ఫలితాలు నమోదు చేయడం అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యా విధానానికి ఒక గొప్ప నిదర్శనమని మరియు దర్పణమని కొనియాడారు. అహర్నిశలు శ్రమిస్తున్నటువంటి సిబ్బంది ద్వారా ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని భవిష్యత్తులోనూ మీ అందరి సహకారంతో అల్ఫోర్స్ విద్యాసంస్థలు అగ్రగామిగా ఉంటాయని ఆకాంక్షించారు. వేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక, జానపద నృత్యాలు ఆలోచింపచేసాయి. వార్షిక ప్రణాళికలో భాగంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి శుభాకాం క్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## వ్యాసరచనలో మెరిసిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించారు. టాటా బిల్డింగ్ ఇండియా నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు విశేషంగా రాణించి పలు బహుమతులను సొంతం చేసుకున్నారు. ఆత్మనిర్భర భారత్ నిర్మాణంలో నా కర్తవ్యం అనే సమకాలీన అంశంపై నిర్వహించిన ఈ పోటీ విద్యార్థుల ఆలోచనా శక్తిని వెలికి తీసింది. సీనియర్ విభాగంలో కె. లక్ష్మి ప్రసన్న ప్రథమ స్థానం సాధించగా, ఎ. శ్రీగౌతమి ద్వితీయ, టి. చందన తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. వీరు వరుసగా బంగారు, వెండి, కాంస్య పతకాలను అందుకున్నారు. జూనియర్ విభాగంలో జి. అరునిమ ప్రథమ స్థానంలో నిలవగా, ఎల్. వెన్నెల ద్వితీయ స్థానం, బి. కీర్తన తృతీయ స్థానం సాధించి పతకాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు పతకాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి. లావణ్య విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట రమణ, మల్లేశం, ప్రమోద, శ్రీధర్, మహేందర్, అనుప్ రెడ్డి, సత్యానందం, సుధారాణి, సౌజన్య, అంజలి, విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

# ధాన్యం కొనుగోళ్లకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయండి

## జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



రాబోయే 202526 వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా,రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా సమీకృత కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా ప్యాడీ క్లీనింగ్ మెషిన్లు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలిని. టోకెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు.రోజూ సేకరించిన ధాన్యాన్ని అదే రోజు నాణ్యత పరీక్షించి రికార్డుల్లో నమోదు చేయాలని డి ఆర్ డి ఓ, సహకార శాఖ అధికారులను ఆదేశించారు. సన్నరకం, దొడ్డురకం వడ్ల గుర్తింపులో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద తగినంత మంది హమాలీలను ముందే సమకూర్చుకోవాలి. ధాన్యం నిల్వకు సరిపడా గోనె సంచులను సిద్ధం చేయాలని,రవాణా శాఖ సహకారంతో మిల్లులకు త్వరితగతిన తరలించాలని పౌరసరఫరాల సంస్థ మేనేజర్ను ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే నమోదు చేసి, రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్,జిల్లా పౌరసరఫరాల అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, డిఆర్డిఓ, జిల్లా సహకార అధికారి, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, తూనికలు కొలతల శాఖ అధికారులు, మెప్మా పీడీ తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతిని అభినందించిన ఈటెల రాజేందర్



**మంథని ప్రభాతవార్త ;** ఇటీవల జరిగిన మున్సి పల్ ఎన్నికల్లో మంథని మున్సిపాల్ బోయిన్ పేట్ 6వ వార్డ్ నుండి విజయం సాధించిన పోతరవేణి శ్రీలత క్రాంతిని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అభినందించారు. గురువారం ఆయన హైదరాబాదులో ఎంపీ ఈటెల రాజేందర్ కలిశారు. మున్సిపల్ ఎన్నికల్లో సింహం గుర్తు పైన పోటీ చేసి 670 ఓట్లకు 474 ఓట్ల బారిమెజారిటీతో గెలుపొందినా విషయం తెలుసుకున్న ఈటెల రాజేందర్ పోతరవేని శ్రీలతక్రాంతిని శాలువా కప్పి సన్మానించారు. బోయిన్ పేట్ ప్రజలకు ప్రస్తుతం చేస్తున్న సేవలను ఇలానే చేస్తూ అందరి మన్నలను పొందుతూ ఇంకా ఇలాంటి ఎన్నో విజయాలు సాధించాలి అని ఆశీర్వధించారు.

# అల్ఫోర్స్ కళాశాలలో 'ఆవిష్కార్ 2కే26'

**కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త:**

నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ,పీజీ కళాశాల వేదికగా రాష్ట్ర స్థాయి కామర్స్ మేనేజ్‌మెంట్ మీట్ "ఆవిష్కార్ 2కే26" గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, నిర్వహణ నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో వివిధ జిల్లాల నుండి సుమారు 15 కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా యంగ్ మేనేజర్, యంగ్ కామర్స్ అవార్డ్, కార్పొరేట్ వాక్, డ్రెస్ ఇంటర్వ్యూ,నర్తనశాల వంటి మొత్తం 19 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వారి మేధస్సుకు పదును పెడుతూ పోటాపోటీగా ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. నైపుణ్యాలే విజయానికి సోపానాలు :కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతను జోడించి ఆత్మవిశ్వాసంతో మంచి ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. విశిష్ట అతిథి లయన్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నారని, అమ్మాయిలు అబ్బాయిలకు ఏమాత్రం తీసిపోరని కొనియాడారు. విద్యార్థులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు మార్గదర్శకంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమ ముగింపు సభకు శాతవాహన యూనివర్సిటీ కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ అధిపతి డా. హరికాంత్ అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. హన్మకొండకు చెందిన వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభతో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ,ప్రశంసా బహుమతులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు..



# మహాశక్తి ఆలయంలోశ్రీరామనవమి వేడుకలు

## భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

**కరీంనగర్ కల్చరల్,ప్రభాతవార్త:**

కరీంనగర్ మహాశక్తి ఆలయంలో రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. హంపి పీఠాధిపతి ఆశీస్సులతో ముగ్గురమ్మలు కొలువైన మహాశక్తి ఆలయాన్ని రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకల కోసం అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు సీతారామచంద్రుడి పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు నిర్వహించే అర్చకులు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఒక్కో ఘట్టాన్ని వివరించనున్నారు. మధ్య మధ్యలో స్వామి వారికి గాన సేవ చేస్తారు. రామయ్యసీతమ్మ పెళ్లి వేడుకల కోసం శమహాశక్తి ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలతో ముస్తాబు చేస్తున్నారు. ఎండాకాలం కావడంతో నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు, విన్నారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ప్రతి ఒక్క భక్తుడి దాహార్తిని తీర్చేందుకు మంచి నీళ్లు, మజ్జిగను అందుబాటులో ఉంచారు. మహాశక్తి ఆలయంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ ఇబ్బందుల్లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులందరికీ వేదపండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



# ఉల్లంపల్లిలో పశు వైద్య శిబిరం విజయవంతం

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**

చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం గాలికుంట (ఎఫ్ ఎం డి ) టీకాల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం మండల పశు వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు ఉచితంగా గాలికుంట టీకాలు వేయబడగా, పశువులలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు అవసరమైన సూచనలు రైతులకు అందించబడినవి. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ హాజరై, పశువుల ఆరోగ్యం గ్రామ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. రైతులు తమ పశువులను నిరంతరం ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న టీకాల కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కానవేని శివకుమార్, పాలకేంద్ర చైర్మన్ పత్తేం రవీందర్, కోల ప్రభాకర్,బల్లు సుధాకర్, ఎనగందుల మహేందర్, పశుసంవర్ధ క శాఖ సిబ్బంది, గ్రామ ప్రముఖులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

## స్ఫూర్తి మహిళ సంఘ భవనానికి భూమి పూజ

## మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**

చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో సర్పంచ్ బోయిని రమేష్ ఆధ్వర్యంలో గురువారం రోజున జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి 10లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న గ్రామ స్ఫూర్తి మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని, మహిళా సాధికారతే సమాజాభివృద్ధికి మూల స్తంభం అని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. సర్పంచ్ బోయిని రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని సమావేశాలు శిక్షణ కోసం భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు, గ్రామంలో గ్రామ సమాఖ్య భవనం నిర్మించి మహిళ సంఘాల అభి వృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధితోనే గ్రామ సమస్యలు పరిష్కారమవుతాయని ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో ప్రభుత్వం మహిళలకు సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో పాలకవర్గం సభ్యులు, మహిళా సంఘం వీవోఏలు, సీఏలు, ఐకేపీ సీసీ లు తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 28న పశువుల వారసంత వేలం

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**

చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 202627 ఒక సంవత్సర కాలానికి గాను పశువుల వారసంత వేలం ఈనెల 28వ తేదీ శనివారం రోజున ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గొల్లెన సంపత్ గురువారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. వీరు మాట్లాడుతూ వేలం పాట లో స్థానికులు, స్థానికేతరులకు అవకాశం ఇవ్వడం జరుగుతుంది. వేలంపాటలో వారసంతను చేజిక్కించుకునే క్రమంలో సరైన ధరావత్తు రాని క్రమంలో వేలంపాటను మరొకసారి వాయిదా కూడా వేయడం జరుగుతుందన్నారు. వేలం పాట లో పాల్గొనే వారందరికీ ఇతర నియమ నిబంధనలు అదేరోజు వేలంపాటలో పాల్గొనే ముందు అన్ని వివరాలు తెలియజేయబడతాయని కార్యదర్శి తెలిపారు.

# కరీంనగర్ వార్త

# అచీవర్స్ లో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:**

కరీంనగర్ కోతిరాంపూర్ లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం ముందస్తు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ సి. హెచ్. వెంకటేశ్వర్లు,



ప్రిన్సిపాల్ సి. హెచ్ . పల్లవి సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థిని విద్యార్థులు ఉపన్యాసాలు,పద్యాలతో శ్రీరామనవమి విశిష్టతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంపూర్ణ రామాయణం నాటిక అలనాటి రామాయణం నేడు కనుల ముందు అనే విధంగా కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ముందు తరాలకు అందించాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ పల్లవి మాట్లాడుతూ రామాయణం విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# యూరియా యాప్ వద్దన్న రైతులు

**తిమ్మాపూర్, ప్రభాత వార్త :**

యూరియా బస్తాల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన యూరియా యాప్ మాకు వద్దంటూ, చదువుకోని మాకు తిప్పలు అవుతుందని రైతులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ సమావేశం గురువారం సంఘం ఆవరణలో జరిగింది. సొసైటీ ప్రత్యేక అధికారి వెంకట శివ నాగేంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. యూరియా కొరత, అప్ ద్వారా బుకింగ్ పైన రైతులు మాట్లాడారు. ఆరు శాతం డివిడెండ్ బోనస్ పంపిణీ చేయాలని, తనఖా పెట్టిన రుణాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. రైతుల ద్వారా ఎన్నిక జరిపి పాలకవర్గంను ఎన్నుకోవాలని, నామినేట్ ద్వారా వద్దని రైతులు తెలిపారు. జమ ఖర్చులను చదివి వినిపించి సభ్యుల సమక్షంలో ఆమోదం పొందారు. పోరంప్లాతకాలకు విద్యా నిధి ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశంలో సభ్యుల చేసిన తీర్మానం మేరకు బోనస్ పంపిణీ, మార్టేజ్ రుణాల చెల్లింపులు చేస్తామని ప్రత్యేక అధికారి వెంకట శివ నాగేంద్ర రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జీ జలాలుద్దీన్ అక్బర్, పోరండ్ల సర్పంచ్ ఆశోద శ్రీనివాస్, సంఘం మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి స్వామి రెడ్డి, ముసుకు మోహన్ రెడ్డి, ఎస్ఎల్ గౌడ్, ఇంచార్జీ సీఈవో శ్రీనివాస్, సంఘం మాజీ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.



# రామలోరి కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి ..ప్రణవ్..

**కళ్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు.**

**పట్టువస్త్రాల సమర్పణ. ఇల్లందకుంట ఆలయాన్ని**

**సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రణవ్.**

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త :

అపర భద్రాద్రిగా పేరు గాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే కళ్యాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలవపందిళ్ళు, త్రాగు నీటి వసతి కల్పించామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. గురువారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి ్మ కిరణ్, హుజూరాబాద్ ఆర్డీఓ రమేష్, ఆలయ ఈఓ సుధాకర్, చైర్మెన్ రామారావు, డైరెక్టర్లు, స్థానిక అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణానికి సుమారు లక్ష మంది హాజరవుతారనీ అంచనా వేశామనీ, జమ్మికుంట నుండి ఇల్లందకుంట వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జమ్మికుంట రైస్ మిల్లర్లు, కాటన్ మిల్లర్ల ఆధ్వర్యంలో ఉచిత మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదానాన్ని ఏర్పాటు చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణానికి మంత్రి పొన్నం హాజరై ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కళ్యాణానికి వచ్చే వాహనదారులకు పార్కింగ్ సంబంధించి పోలీసు శాఖ అధికారులు ఇప్పటికే మార్కింగ్ ఇచ్చారని అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం.. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని భక్తులకు ప్రతి సంవత్సరం రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



# మహిళల, బాలికల అభ్యున్నతికి సంస్థల సమన్వయం“..

కమలాపూర్: ప్రభాతవార్త.

మహిళల, బాలికల అభ్యున్నతికి సంస్థలన్నీ కలిసి పని చేయాలి.అనిహనుమకొండ జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత అన్నారు. గురువారం కమలాపూర్ మండల కేంద్రం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని సమావేశ హాలులో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ నిర్వహించిన మహిళల సంక్షేమం బాలల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వ ప్రభుత్వ సంస్థల సమన్వయ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.“కుటుంబ స్థాయి నుండి పిల్లలకు ఆడ మగ అనే తేడా లేకుండా సమాన భాగస్వామ్యంతో పెంచడం అవసరం“ అని సునీత అన్నారు. నైతిక విలువలతో కూడిన జీవితాన్ని ఏర్పాటు చేసుకునేటట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల విద్యను కొనసాగించే విధంగా తల్లితండ్రులు బాధ్యత వహించాలని అదేవిధంగా పిల్లల సంరక్షణతో పాటు వారికి సరైన మార్గ నిర్దేశం చేయాలని కోరారు.డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ ఆడపిల్లల జననాలను ప్రోత్సహించాలని, వారి ఆరోగ్యానికి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆడపిల్లల మరియు మహిళల సామాజిక శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధికి అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు.సర్వోదయ సంస్థ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిరా మాట్లాడుతూ వివిధ సంస్థల సమన్వయంతో మహిళల మరియు బాలల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. మహిళల బాలల సమస్యలను గుర్తించి కారణాలను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా ఉండాలని అన్నారు.ఏపీ ఎమ్ లలిత మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి తో పాటు వారి హక్కులను కల్పించడం, సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఉమెన్ హబ్ కో ఆర్డినేటర్ కళ్యాణి మాట్లాడుతూ మహిళల, బాలలకు ఉన్న అవకాశాలను తెలుసుకొని వారు వినియోగించుకునే విధంగా చూడాలని, సమస్యలకు మూల కారణాలను విశ్లేషించి నివారించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రేణుక రమాదేవిబాలల పరిరక్షణ విభాగం నుండి సునీత, సఖి వన్ స్టాప్ సెంటర్ నుండి భారతి, రజిత చైల్డ్ హెల్ప్ లైన్, మహిళా సాధికారత కేంద్రం నుండి స్వర్ణలత, మానస, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం నుండి డాక్టర్ అరుణ్ డాక్టర్ మానస ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, సర్వోదయ సంస్థ నుండి అక్తర్, సుహాసిని, ఎమ్మెస్ డబ్ల్యూ స్టూడెంట్స్ పాల్గొన్నారు.




# కారు అడ్డుపెట్టి ....ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు.....

వీణ వంక,ప్రభాత వార్త:

కారును అడ్డుపెట్టి ఇసుక లారీ ల ను గ్రామస్థులు అడ్డుకున్న సంఘటన గురువారం వీణ వంక మండలం రెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. వీణ వంక మండలం రెడ్డి పల్లి గ్రామం ద్వారా పోతిరెడ్డిపల్లి,కొండపాక ఇసుక రీచ్ ల నుండి లారీల ద్వారా రవాణా జరుగుతుంటుంది.ఈ రవాణా తో రోడ్ పై లేచిన దుమ్ముతో రెడ్డిపల్లి గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదు చేయడంతో గత 10 రోజుల క్రితం దుమ్మును నివారించేందుకు ట్రాక్టర్ నీటి ట్యాంకర్ల ద్వారా నీరు ను చళ్ళు తుండే వారు.కానీ ఐదు రోజుల నుండి వేసవి కాలం కావడం తో విపరీతమైన దుమ్ము వెదజల్లుతున్న నీటి చల్లే నీటి ట్యాంకర్లు రాకపోవడంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు కారు ను అడ్డుపెట్టి లోడ్,ఖాళీ లారీలను నిలిపివేశారు.దీంతో అటువైపు వెళ్ళే వాహన దారులు పోలీస్ లకు సమాచారమందాదముతో ఆ సంఘటన స్థలానికి చేరుకొని ఎం డి సి అధికారుల తో గ్రామస్థులను పోలీస్ మాట్లాడించి నప్పటికీ,దుమ్మును నివారించేందుకు ఎ ట్రాక్టర్ యజమానో స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టు బట్టడంతో లోడ్ లారీలను వదిలివేసి,ఖాళీ లారీలను స్పష్టమైన హామీ ఇచే వరకు వదలమనిగ్రామస్తులు తెగేసి చెప్పారు.



# కమలాపూర్ లో పర్యటించిన ఈటెల..

**మానవత్వం చాటుకున్న మాజీమంత్రి మల్కాజిగిరి ఎంపీఈటెల రాజేందర్...**

కమలాపూర్: ప్రభాత వార్త.

హుజురాబాద్ నియోజకవర్గంలో గురువారం మాజీ మంత్రి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పర్యటించారు. పర్యటనలో భాగంగా భాగంగా కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో, బీజేపీ నాయకులు బండి కళాధర్, తల్లి (గూడూరు సర్పంచ్ బండి వనజ వారి యొక్క అత్తమ్మ) ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఈటెల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయనకు కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి నాయకుడు తదితరులు పాల్గొన్నారు.అనంతరం కమలాపూర్ మండలంలో పర్యటన ముగించుకొని హనుమకొండకు వెళుతున్న క్రమంలో మార్గమధ్యలో ప్యాసింజర్ ఆటో బోల్తాపడగా గమనించిన ఈటెల రాజేందర్ వెంటనే ఆగి వారికి సహాయం చేసి క్షతగాత్రులను హనుమకొండ హాస్పిటల్ కు, తరలించి తన మానవత్వం చాటుకున్నారు. ఈటెల రాజేందర్ మానవత్వం చాటుకున్న తీరును గమనించిన ప్రజలు అభినందించారు. “మానవత్వం చాటుకున్న ఈటెల రాజేందర్ నిజమైన సేవకుడు“అని ప్రశంసించారు. ఈటెల రాజేందర్ ఈ చర్య ప్రజలకు ఆదర్శప్రాయం అని, ఆయన మానవత్వానికి ప్రతీక అని ప్రజలు అభివర్ణించారు. మానవత్వం చాటుకున్న ఈటెల రాజేందర్ కి అభినందనలు తెలిపారు.



## హుజూరాబాద్ వార్త

# ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర కీలకం..ప్రణవ్..

**ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం**

**ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా అవసరం.**

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త :

సమాజంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర కీలకమైందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలో ఎల్ఐసి



ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏజెంట్లు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటితో, కుటుంబంతో ఎల్ఐసి ఏజెంట్లకు మంచి సంబంధాలు కలిగి ఉంటాయని, వారికి మాజీ రాజ్యసభ సభ్యులు వొడితల రాజేశ్వర్ రావు ఎల్ఐసి బిల్డింగ్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్డింగ్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా ఏజెంట్లకు సంబంధించి ఏవైనా సమస్యలు నా దృష్టికి వస్తే వాటిని పరిష్కారం చేయడానికి నా వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ఎల్ఐసి ప్రతినిధులు, ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు వడ్లూరి




కిషోర్ అన్నారు.గురువారం డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ నోటిఫికేషన్ వెయ్యాలని అదేవిధంగా ఎన్నికల్లో యువతకు ఇచ్చిన నిరుద్యోగ భృతి అమలు చేయాలని చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తే ముందస్తుగా అరెస్టు చేయడం సరైనది కాదని జమ్మికుంటలో డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు వడ్లూరి కిషోర్ ను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. గత రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా బడ్జెట్లో యువతకు నిధులు కేటాయించకుండా వాటిని అమలు చేయాలని ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టు చేయడం సరైనది విధానం కాదని రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున యువతను సమీకరించి వారి సమస్యలు పరిష్కరించడానికి పోరాటాలు చేస్తామని తెలిపారు.

# శ్రీరామ నవమి కళ్యాణం కోసం కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు

### -గోదావరిఖని ఏసీపి ఎం. రమేష్

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

శ్రీరామ నవమి కళ్యాణం కోసం కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని ఏసీపి ఎం. రమేష్ తెలిపారు. గురువారం గోదావరిఖని వన్ టౌన్ కోదండ రామాలయంలో రేపు జరిగే కళ్యాణం భద్రతా చర్యలను ఏసీపి ఎం. రమేష్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగ పూట భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆలయ పరిసరాల్లో పోలీసు సిబ్బందిని నియమించి బ్యారికేడ్లు ఏర్పాటు చేశామని, క్యూలైన్ల ద్వారా భక్తులను సజావుగా పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భక్తుల రాకపోకలకు



ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వంద శాతం పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలి

### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



గ్రామాల్లో వంద శాతం పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అనన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి నిర్మాణం అసెస్మెంట్ వంద శాతం పూర్తి చేయాలని, ప్రతి ఇంటి నుంచి ఆస్తి పన్ను తప్పనిసరిగా వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని నిర్మాణాలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించని పక్షంలో రైస్ మిల్లర్లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలను మూసివేయాలని ఆదేశించారు. ఆర్టిసి బస్ స్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలకు కూడా డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఏప్రిల్ 2న జరిగే గ్రామ సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం గత 2 సంవత్సరాలుగా అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఏప్రిల్ 16న మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ ఆస్తుల పంపిణీ చేపట్టాలని కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డిఎల్ పిఓలు, ఎంపిఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి డ్రైవర్ బాధ్యత

### గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని గోదావరిఖని ఏసీపి ఎం. రమేష్ అన్నారు. గురువారం అరైవ్ అలైవ్ కార్యక్రమం మూడవ దశలో భాగంగా అంతర్గం ఎస్.ఐ వెంకట్ ఆధ్వర్యంలో కుందనపల్లిలోని ఐఓసిఎల్ డిపోలో ట్యాంకర్ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ముఖ్యంగా ట్యాంకర్ డ్రైవర్లు దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే సందర్భంలో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, అలసటతో వాహనం నడపరాదని సూచించారు. వేగ పరిమితులను పాటించడం, సీటుబెల్ట్



ధరించడం, మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్యాంకర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గం ఎస్.ఐ వెంకట్ పాల్గొన్నారు.

# పెద్దాపూర్ జాతర వేలం అట్టహాసం

జూలపల్లి,ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి జాతరను పురస్కరించుకుని, స్వామివారి ప్రసాదాలు, ఇతర సేవల వేలం పాటను స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేలం ప్రక్రియ అంతా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) సదయ్య ప్రత్యక్ష పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా కొనసాగగా, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేలం పాటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేలంలో భాగంగా లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయ హక్కులు అత్యధికంగా 1,63,000/ రూపాయలకు అమ్ముడుపోగా, కొబ్బరికాయల వేలం ద్వారా 73,000/ రూపాయలు, కొబ్బరి ముక్కల పోగు ద్వారా 37,000/ రూపాయలు, అలాగే కూల్‌డ్రింక్స్ విక్రయ హక్కుల ద్వారా 9,000/ రూపాయల ఆదాయం సమకూరింది. వెరసి ఈ వేలం పాటల ద్వారా ఆలయానికి మొత్తం 2,82,000 రూపాయల భారీ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొగరు శ్రీనివాస్, ఉపసర్పంచ్ జెల్ల కనుకయ్య, మాజీ సర్పంచ్



గొట్టిముక్కుల రవీందర్ రెడ్డి పాల్గొని వేలం నిర్వహణను పర్యవేక్షించగా, వార్డు సభ్యులు తీగల అశోక్, పెసరు లచ్చయ్య, కల్లెపల్లి స్వామి, మాజీ ఉపసర్పంచ్ బొజ్జ శ్రీనివాస్ తమ సహకారాన్ని అందించారు. వీరితో పాటు బొజ్జ మల్లయ్య, గడ్డమీది మహేష్, భాస్కర్ రెడ్డి, కృష్ణమూర్తి, అమరగని లింగయ్య, గోపాలకృష్ణ, సంకెండ్ల లక్ష్మణ్, బొజ్జ సంపత్, దాడి నాగరాజు, కొక్కుల రాజమోళి, వొదనాల సురేష్, పెసరు స్వామి, శంకరయ్య, దేవాదాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో హాజరై జాతర వేలం ప్రక్రియను విజయవంతం చేశారు. రాబోయే జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఈ నిధులను వెచ్చిస్తామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రతినిధులు తెలియజేశారు.

## హుండీ లెక్కింపులో రూ.1.90 లక్షల ఆదాయం

**మంథని ప్రభాతవార్త:** మంథని పట్టణంలోని పలు దేవాలయాల్లో గురువారం జరిగిన ఉండి లెక్కింపులో దాదాపు రూ.1.90 లక్షల ఆదాయం సమకూరిందిశ్రీ మహాలక్ష్మి దేవాలయంలో భక్తులు అమ్మవారికి కానుకల రూపంలో హుండీలో వేసిన డబ్బులు రూ.82,653 రూపాయలు ఆదాయం లభించగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో హుండీల ద్వారా రూ 1,07,644 రూపాయల ఆదాయం లభించింది. ఈ దేవాలయాలలో మంథని పట్టణానికి చెందిన శ్రీ మహాలక్ష్మి సేవా సమితి సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొని హుండీలను లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేరువేరుగా జరిగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో మహాలక్ష్మి దేవాలయ కార్యనిర్వాహణాధికారి రాజకుమార్, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ కార్య నిర్వహణ అధికారి ముద్దసాని శంకర్. మహాలక్ష్మి దేవాలయ అర్చకుడు మారుపాక ప్రశాంత్ శర్మ, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయ అర్చకుడు తీరువరంగం ప్రసాదాచార్యులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దపల్లి వార్త

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ ఆమోదం

సుల్తానాబాద్,ప్రభాతవార్త:



మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మొత్తం ఆదాయం రూ.12.54 కోట్లు, వ్యయం రూ.12.36 కోట్లుగా నిర్ణయించారు. అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో 29 అంశాలపై చర్చించి బోర్వెల్లు త్రవ్వడం, రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు, వీధి దీపాల సమస్యల పరిష్కారం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ ఛైర్పర్సన్ పుష్పలత, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు, ఎన్ పి డి సి ఎల్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి

### -పెద్దపల్లి డిసిపి బి. రామ్ రెడ్డి

పెద్దపల్లి, ప్రభాతవార్త:



శ్రీరామనవమి శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలని పెద్దపల్లి డిసిపి బి. రామ్ రెడ్డి అన్నారు. గురువారం పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో బి. రామ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్రకు పోలీసులు పూర్తి స్థాయిలో బందోబస్తు కల్పిస్తున్నారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సర్వ మతాల వారు ఐకమత్యంతో ఉంటూ పట్టణ ప్రశాంతతకు భంగం కలగకుండా చూడాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఏసిపి జి. కృష్ణ, సిఐ కె. ప్రవీణ్ కుమార్, ఎస్.ఐ జె. లక్ష్మణ్ రావుతో పాటు పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### -పెద్దపల్లి డివిజన్ కార్యాలయం ఎదుట టీవీఏఈ జేఏసీ ధర్నా

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

విద్యుత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీవీఏఈ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాఘవాపూర్‌లోని పెద్దపల్లి డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్, అన్మ్యాన్డ్, పీస్ రేట్ కార్మికులు భారీ నిరసన చేపట్టారు. టీవీఏఈ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ ధర్నాలో కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్లు, బిల్ కలెక్టర్లు, ఎస్పీఎం తదితర విభాగాల కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం జాప్యం చేయడం తగదన్నారు. కార్మికుల హక్కులను కాపాడటంలో నిరక్ష్యంల్ల వహిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డివిజన్ పరిధిలోని వివిధ విభాగాల కార్మికులు, జేఏసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చొప్పదండి వార్త



# భక్తుల నోట.... రామకోటి మాట..

**భక్తులకు పెరుగుతున్న ఆధ్యాత్మిక చింతన**

**రామకోటి రాసేందుకు భక్తుల శ్రీకారం**

**భక్తులకు 1500 పుస్తకాలను**

**అందజేసిన చీకట్ల లచ్చయ్య**

**8 కోట్లకు పైగా రామ నామాలు**



చొప్పదండి ప్రభాతవార్త:

రామకోటి రాయాలని సంకల్పం భక్తుల నుండి రోజురోజుకు విశేషంగా కలుగుతుంది భక్తుల నోట రామకోటి మాట చాలా భక్తుల నుండి వినిపిస్తుంది. రామకోటి రాస్తే అనుకున్నది సిద్ధిస్తుంది అని భక్తుల గట్టి నమ్మకం .గత కొద్ది కాలంగా రామకోటి పుస్తకాలకు విశేష భక్తుల ఆదరణ లభిస్తుంది నేడు సీతారాముల కళ్యాణ మహోత్సవానికి దేవాలయాలు ముస్తాబు అవుతున్న సమయంలోనే భక్తులు రామకోటి రాసి పుస్తకాలను సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు చొప్పదండి పట్టణానికి చెందిన శ్రీ హనుమాన్ భజన మండలి సభ్యులు ప్రముఖ భక్తి పాటల గాయకుడు చీకట్ల లచ్చయ్య రామకోటి పుస్తకాలను భక్తులకు అందించేందుకు విశేష కృషి చేస్తున్నారు రాముని పైన భక్తితో పుస్తకాలను భక్తులకు అందజేసి రామకోటి రాసేందుకు వారిని ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు ఈ నేపథ్యంలో ఆయన నేటి వరకు 1500 పుస్తకాలను కరీంనగర్ మంచిర్యాల్ జిల్లాలో ఉన్న భక్తులకు పంపిణీ చేశారు పుస్తకాలను అందించినప్పుడు వారి పేర్లను నమోదు చేసుకొని మళ్లీ వారిని ఫోన్ చేసి రామకోటి రాసి అందజేయాలని సూచిస్తూ ఉంటారు .కరీంనగర్ లోని నీలకంఠ భజన మండలి గౌరవ అధ్యక్షులు గర్రెపల్లి ఆంజనేయులు వ్యవస్థాపక అధ్యక్షులు బంజారా శ్రీధర్ గౌడ్ ల సహకారంతోనే రామకోటి పుస్తకాలను తీసుకొని భక్తులకు అందజేస్తున్నారు భక్తుల ఇంటింటికి వెళ్లి పుస్తకాలను అందజేసి తిరిగి పూర్తిగా రాసిన తర్వాత మళ్లీ వారి ఇంటికి వెళ్లి పుస్తకాలను సేకరిస్తూ రాముని పైన భక్తిని చాటుకుంటున్నారు ఇప్పటివరకు ఆయన పంపిణీ చేసిన 1500 పుస్తకాల లో 8 కోట్లకు పైగా రామనామాలను భక్తులు లెక్కించినారు రాసిన వారికి ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలుగుతాయని దానితోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని పేర్కొంటున్నారు ఈ సందర్భంగా రామకోటి నిర్వహణ కమిటీ నిర్వాహకులు హనుమాన్ భజన మండలి సభ్యులు గాయకులు చీకట లచ్చయ్య మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంది అని అన్నారు దైవ చింతనతో అన్ని కుటుంబాలకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు ఆధ్యాత్మిక సేవ చేయడంలో ఎప్పుడు వెనకాడనని పేర్కొన్నారు మరిన్ని పుస్తకాలను భక్తులకు అందజేసి రాముని పైన భక్తిని చాటుకుంటానని పేర్కొన్నారు.



## ఏప్రిల్ 6 నుండి విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలన

**నవోదయ ప్రిన్సిపల్ బ్రహ్మానంద రెడ్డి**

చొప్పదండి ప్రభాతవార్త:



చొప్పదండి పట్టణంలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026 27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఏప్రిల్ 6 నుండి పరిశీలన చేస్తున్నట్లు నవోదయ ప్రిన్సిపల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు ఆరో తరగతిలో ప్రవేశాల కోసం 2025 డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించామని విద్యాలయ సమితి ఎంపికైన విద్యార్థుల జాబితాను తాత్కాలిక పద్ధతిన ప్రకటించారని వారి సర్టిఫికెట్లను అరుణ పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు విద్యార్థులు ఆధార్ కార్డు పుట్టిన తేదీ ధ్రువీకరణ విద్యార్థి పెన్ నంబర్ అపార్ ఐడి నెంబర్ మూడవ తరగతి నుండి 5వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు గ్రామీణ ప్రాంతం అయితే రూరల్ సర్టిఫికెట్ కులం ధ్రువీకరణ పత్రం ఆదాయ ధ్రువీకరణ పత్రం నివాస ధ్రువీకరణ పత్రాలను తీసుకొని విద్యాలయంలో హాజరుకావాలని కోరారు నవోదయవిద్యాలయ సమితి ప్రకటించిన విద్యార్థులు మాత్రమే హాజరుకావాలని కోరారు ఈ అవకాశాన్ని ఎంపికైన విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు

## సైనిక్ పాఠశాలకు ఆర్ ఓ ప్లాంట్ వితరణ

చొప్పదండి ప్రభాతవార్త:




సిఎస్ఐఆర్ ఇనిషియేటివ్ ఆఫ్ వేలగ్రో బయో సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రెండు లక్షల ఏబది వేల రూపాయల విలువ గల, గంటకు 1000 లీటర్ల నీరును అందించే ఆర్వో ప్లాంట్ ను మండల పరిధిలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ శాఖ సైనిక్ పాఠశాలకు వితరణగా అందజేశారు. అలాగే లక్ష డెబ్బై వేల రూపాయల విలువ గల 40 టేబుల్స్ , 40 ఐరన్ చైర్స్ అందజేశారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రతి సంవత్సరం ఎంతో కొంత సామాజిక సేవ ద్వారా విద్యాసంస్థలకు, ఓల్డ్ ఏజ్ హోమ్స్ కి, క్యాన్సర్ పేషంట్లకు చేయూత అందించడం సంస్థ లక్ష్యం. ఈ కార్యక్రమంలో ఆర్ ప్రసాద్ బాబు మేనేజర్ రెగ్యులేటరీ,జి శ్యామ్ శంకర్ సర్వీస్ లీగల్ ఫెయిర్, డి అవినాష్ ఫీల్డ్ డెవలప్మెంట్ లీడర్ పాల్గొని సంస్థకు అందించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపల్ వి.లింగయ్య వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రమోద్ రాజ్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతార సిబ్బంది విద్యార్థులు వేలగ్రో సంస్థకి సంస్థ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపికైన విద్యార్థులు

చొప్పదండి ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్లో అడ్మిషన్ల కొరకు అంబేద్కర్ స్టేడియం కరీంనగర్ లో జరిగే జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలలో పాల్గొనే చొప్పదండి మండల విద్యార్థుల వివరాలను మండల విద్యాధికారి పి మోహన్ తెలిపారు ఎండి.ఇమ్రాన్ (ఎం.పీ.పీ ఎస్ పెద్దకుర్మపల్లి), ఎండి.అష్రఫ్, ఏ. మనీష్, కే. శివ ప్రణయ్ (ఎంపీపీ ఎస్ గర్ల్స్ చొప్పదండి), వి. శ్రీనిధి (ఎంపీపీ ఎస్ బాయ్స్ చొప్పదండి )మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగినదని తెలిపారు.జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలలో పాల్గొనే విద్యార్థులు మండల సెక్రటరీ( జడ్పీహెచ్ఎస్ బాయ్స్ చొప్పదండి ఫిజికల్ డైరెక్టర్) కే. కృష్ణను సంప్రదించాలని తెలిపారు.

## నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలి

**కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ ను పూర్తి చేయాలి**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర,ప్రభాత వార్త:



చొప్పదండి నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసెంబ్లీలో మాట్లాడారు ఉత్తర తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం లో నీటి సమస్య ఉందని. సమస్యను పరిష్కరించడానికి కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ ను పూర్తిచేయాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే కొండగట్టు తో పాటు, పక్కనే ఉన్న జేఎన్టీయూ కళాశాల తో పాటు పలు గ్రామాలకు త్రాగునీటికి ఇబ్బంది ఉండదని సభ దృష్టికి తీసుకువచ్చారు. చొప్పదండి నియోజకవర్గం తో పాటు, వేములవాడ నియోజకవర్గానికి సాగునీరు అందించే నారాయణపూర్ రిజర్వాయర్ నీటితో నింపిన క్రమంలో కట్ట కింద ఉన్న గ్రామస్తులు నిత్యం పాములు, తేళ్ళు, విష కీటకాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కట్ట ఎత్తు పెంచడంతోపాటు, నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి పరిహారం అందజేయాలని, నారాయణపూర్ కుడి కాలువను పూర్తిచేయాలని కోరారు. రామడుగు మండలంలోని మోతే రంగసాయిపల్లి, రుద్రారం గ్రామాల రోడ్డు పూర్తిగా దెబ్బతిందని. రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

## ఎన్ఎస్వి ఆల్ఫోర్స్ లో ముందస్తు శ్రీరామనవమి వేడుకలు

మల్యాల/ ప్రభాతవార్త



మల్లీ ఎలా క్రాస్ రోడ్డులోని ఎన్ఎస్వి ఆల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు, ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీరాములు సీతమ్మ లక్ష్మణుడు హనుమంతుడు వంటి పాత్ర దారణలో ఆకట్టుకున్నారు, కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి హాజరై, పాఠశాలలో నిర్వహించిన సాంస్కృత కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు, ఈ వేడుకల ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి , సాంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందడంతో పాటు ఆధ్యాత్మిక భావన బలపడుతుందని అన్నారు, పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## తెలంగాణ జాగృతి నాయకుల ముందస్తు అరెస్టు

చొప్పదండి ప్రభాతవార్త:



రాష్ట్ర బడ్జెట్లో నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం, ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీ లలో మహిళా యువతకు ఇస్తామన్న స్కూటీలను బడ్జెట్ కేటాయింపు జరగకపోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పైన యువత అసహనాన్ని వ్యక్తం చేస్తూ జాగృతి రాష్ట్ర పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా జాగృతి నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందని తెలంగాణ జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి అన్నారు. రాష్ట్రంలో వేల కోట్లు పేరుకుపోయిన విద్యార్థుల ఫీజు బకాయిలకు బడ్జెట్లో అంతంత మాత్రం కేటాయించడం పట్ల కళాశాలల యాజమాన్యం అధ్యాపకులు తీవ్ర ఒత్తిడికి లోనవడంతో విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ అందక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల హామీలను అమలు పరచాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తమను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తిరుపతి పేర్కొన్నారు.

## జాతీయస్థాయి విలువిద్య పోటీలలో ప్రతిభ

చొప్పదండి ప్రభాతవార్త:



జాతీయస్థాయిలో నిర్వహించిన విలువిద్య పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ అభినందించారు ఈ మేరకు. కరీంనగర్ పట్టణ ప్రాంతానికి చెందిన కొండపాక అతర్వ్ జాతీయ అర్చరి పోటిల్లో ఎంపికైన సందర్భంగా ఉమ్మడి గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్ శాలువా బొకే తో సన్మానం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ దివ్య,డాక్టర్ కొండపాక కిరణ్ కుమార్ గౌడ్ సన్ రైజ్ హాస్పిటల్ కుమారుడు అతర్వ్ 10 సంవత్సరాల లోపు రాష్ట్ర స్థాయి అర్చరీ (విలు విద్యలో ) పాల్గొని జాతీయ అర్చరీ పోటీకి ఎంపికైన్నారు. కొండపాక అతర్వ్ డాక్టర్స్ కుటుంబం లో పుట్టి క్రిడలో రానించటం చాలా గొప్ప విషయం అని అన్నారు. అర్చరీ పోటిల్లో జాతీయ స్థాయి లో గోల్డ్ మోడల్ సాధించాలని కోరారు.

# రోడ్డు భద్రత నియమ,నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు

**- వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్**

**- 112 మంది మందుబాబులకు కౌన్సెలింగ్, జరిమానాలు**



వేములవాడ, ప్రభాతవార్త:

రోడ్డు భద్రత నియమ, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్ అన్నారు. ఇటీవల వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 112 మంది మందుబాబులు పట్టుబడగా, వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి, అనంతరం కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా వేములవాడ మేజిస్ట్రేట్ జోతిర్మయి ఇందులో 86 మందికి ఒక్కొక్కరికి 5వేల చొప్పున, 26 మందికి 2వేల చొప్పున జరిమానా విధించారు. కౌన్సెలింగ్ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి రోజూ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వారి తల్లిదండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామ్మోహన్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు తదితరులున్నారు. అనంతరం ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారితో ప్రతిజ్ఞ చేయించారు.




## శ్రీరామనవమికి ముస్తాబైన జోగాపూర్ రామాలయం

చందుర్తి ప్రభాతవార్త:





శ్రీరామ నవమిని పురస్కరించుకొని చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర ఆలయం కళ్యాణానికి ముస్తాబైంది, ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది, శుక్రవారం ఉదయం 11:35 నిమిషాలకు మిథున లగ్న ముహూర్తాన కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు, ఆలయంలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు హోమం కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు, శ్రీరామనవమి సందర్భంగా ఆలయాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు, వేసవి దృష్ట్యా భక్తులకు చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు, అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, స్వామివారి కల్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరు ఆలయ ఉత్సవ కమిటీ, గ్రామ ప్రజలు పిలుపునిచ్చారు, గ్రామపంచాయతీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

## మిషన్ భగీరథలో మురికి నీరు సరఫరా

**తీవ్ర ఇబ్బందుల్లో కోనరావుపేట కాలనీవాసులు**

**తక్షణ చర్యలకు డిమాండ్**



ప్రభాతవార్త కోనరావుపేట:

కోనరావుపేట మండల కేంద్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీరు మురికిగా రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పథకం ద్వారా శుద్ధమైన త్రాగునీరు అందాలని ఆశించిన ప్రజలకు, ప్రస్తుతం కలుషిత నీరు రావడం ఆందోళన కలిగిస్తోంది. త్రాగునీరు పూర్తిగా మురికిగా ఉండటంతో ప్రజలు దానిని తాగడానికి మాత్రమే కాకుండా, కనీసం రోజువారీ పనులకు కూడా ఉపయోగించలేని పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో నీరు గందరగోళంగా, దుర్వాసనతో రావడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఈ పరిస్థితిలో మరింత కష్టాలు ఎదుర్కొం టున్నారు.తాగునీరు కోసం ఇతర వనరులపై ఆధారపడాల్సి వస్తోందని, అది నవ ఖర్చులు భరించాల్సి వస్తోందని కాలనీవాసులు తెలిపారు.ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు సరైన పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి, నీటి శుద్ధి ప్రక్రియను మెరుగుపరచాలని, పైపులైన్లలో ఉన్న లోపాలను సరిచేసి శుద్ధమైన త్రాగునీరు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.ఇలాంటి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని, ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని కాలనీవాసులు పేర్కొన్నారు.

## విద్యార్థులు కళల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి

చందుర్తి ప్రభాతవార్త:



విద్యార్థులు కళల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని ఉపాధ్యాయురాలు రజిత అన్నారు, చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు ప్రపంచ రంగస్థలం దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు, ఈ సందర్భంగా విద్యార్థులచే మొబైల్ దుష్ప్రభావం, ప్లాస్టిక్ భూతం అనర్థాలపై పాత్రల ద్వారా వివరించారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్, రజిత మాట్లాడుతూ మనిషి భావాలను, అనుభవాలను, సమాజంలోని వాస్తవాలను ప్రత్యక్షంగా ప్రదర్శించే కళారూపం రంగస్థలంమని ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఏదో ఒక కళను నేర్చుకోవాలి. నటులు, గాయకులుగా, కథకులుగా ఎదగాలన్నారు. తద్వారా భవిష్యత్తులో మానసికంగా ఆనందంగా జీవించడానికి అవకాశం ఉంటుందన్నారు, అంతేకాకుండా కళల ద్వారా ఉన్నతంగా ఎదగవచ్చునన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరుమల విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలతో ప్రమాదాల నివారణ

**చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు**

చందుర్తి ప్రభాతవార్త:



ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగవని చందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ గండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో గురువారం రాత్రి అరైవ్ అలైవ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు, రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్.. అలైవ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదని, తద్వారా కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మల్లేశం,గంగారాం, మనోహర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# రసభసగా సర్వసభ్య సమావేశం

**-ఎరువుల కొరతపై రైతుల ఆగ్రహం**




**ప్రభాతవార్త కోనరావుపేట:** కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇంచార్జి లచ్చయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం రస బసగా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు సకాలంలో ఎరువులు అందజేయలేదని సభలో రైతులు మండిపడ్డారు అధికారులు రైతులతో మాట్లాడుతూ, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటలను సాగు చేయాలని సూచించారు.ఆయిల్‌పామ్ పంటలో అధిక దిగుబడి, స్థిరమైన ఆదాయం పొందే అవకాశాలపై వారు విపులంగావివరించారు.పంట మార్పిడి ద్వారా రైతులు లాభాలను పెంచుకోవచ్చని తెలిపారు.అనంతరం ఎరువుల నిల్వల విషయంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువులు సమయానికి, సరిపడా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని అధికారులను ప్రశ్నించారు.ఎరువులు, విత్తనాల సరఫరా, ధరలు అందుబాటు విషయాల్లో పారదర్శకత ఉండాలని రైతులు డిమాండ్ చేశారు.అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఖర్చులు, లాభాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలనిఅధికారులకు సూచించారు.ఈ సమావేశం రైతుల్లో అవగాహనపెంపొందించడమే కాకుండా, వారి సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలకంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాస్కూరి కాశీరాం,మండల అగ్రికల్చర్ ఆఫీసర్ దుర్గరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధాల లింబయ్య, మేకల ప్రభాకర్ రెడ్డి, సి ఓ కేశవులు ఏఈఓ రమేష్ రైతులు జింక వెంకటి, మాందల శ్రీనివాస్,యాస శ్రీనివాస్, రాసరత్నాకర్ రెడ్డి, కస్తూరి సంజీవరెడ్డి, రణధీర్,రత్నం,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కోనరావుపేటలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**ప్రభాతవార్త కోనరావుపేట**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గురువారం కోనరావుపేట మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కోనరావుపేట ఎస్సై కె. ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం మరియు అజాగ్రత్త వల్ల అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సురక్షిత ప్రయాణంతోనే క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు స్థానిక వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ద్వంద్వ రాజకీయాలతో కార్మికులను గందరగోళానికి గురిచేస్తున్న ఏఐటీయూసీ

**-ప్రభుత్వంపై ఐఎన్టీయూసీ పై విమర్శలు చేయడం సరికాదు**

**-ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్‌కోట రవీందర్ రెడ్డి**

రామగిరి ప్రభాతవార్త:

ఏఐటీయూసీ ద్వంద రాజకీయాలతో కార్మికులను గందరగోళానికి గురి చేస్తూ ప్రభుత్వంపై, ఐఎన్టీయూసీ యూనియన్ పై విమర్శలు చేయడం తగదని ఆర్ జి త్రీ ఐఎన్టి యుసి ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం సెంటినరీ కాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అర్ జీ 3 ఏపీఏ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఏఐటీయూసీ నాయకులు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తూ "సేవ్ సింగరేణి పోరు జాత" పేరుతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం హోదా ఇచ్చినా, యాజమాన్యంతో చర్చలు జరిపి స్ట్రక్చర్ కమిటీలు నిర్వహించే సామర్థం లేకుండా ప్రభుత్వం మరియు ఐఎన్‌టీయూసీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అదే సమయంలో, ఒక వైపు ప్రభుత్వంలో భాగస్వామ్యం అంటూనే, మరోవైపు ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వంద్వ వైఖరి అని అన్నారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు ఎమ్మెల్యే సాంబశివరావు రాజకీయ నాయకుడే కాదా? అని ప్రశ్నించారు. మునిసిపల్ ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం ద్వారా



కార్మికుల్లో గందరగోళం సృష్టించి ఓట్లు దక్కించుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఐఎన్టీయూసీబాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, ఆరు ప్రాంతాల్లో ప్రాతినిధ్య సంఘంగా గెలిచినప్పటికీ ఎప్పటికప్పుడు ప్రభుత్వ పెద్దలు, మంత్రులతో చర్చలు జరిపి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. తమ నాయకుడు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ మరియు మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగుతున్నదని తెలిపారు. ఈ సమావేశం లో కేంద్ర కమిటీ కార్యదర్శులు ఎల్లంకి రామారావు, ఉయ్యాల కుమారస్వామి, మడ్డి రాజకుమార్, పిట్ సెక్రటరీలు రామిండ్ల మనోహర్, తోకల ప్రవీణ్ రెడ్డి, కే.ఎన్. చారి, రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు బుద్దే సదానందం, ట్రెజరర్ కొలిపాక సారయ్య, నాయకులు గిరవేణి కొమురయ్య, సురేష్, సుమన్, అర్జున్ రావు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంథని వార్త



## డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష

**-మంథని ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్**

**-ముత్తారంలో యాంటి డ్రగ్ అవైర్నెస్ ప్రోగ్రాం**

ముత్తారం, ప్రభాతవార్త:



డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని మంథని ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్ హెచ్చరించారు. గురువారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముత్తారం మండల కేంద్రంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలను, చట్టపరమైన కఠిన శిక్షలను గ్రామ ప్రజలకు వివరించారు. 18 నుండి 30 ఏళ్ల లోపు యువత డ్రగ్స్ పట్ల ఆకర్షితులయ్యే అవకాశం ఉందని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల చట్టం 1985 ప్రకారం డ్రగ్స్ కేసులలో పట్టుబడిన వారికి 10 నుండి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రెండు లక్షల రూపాయల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. వ్యసనానికి గురై జీవితాలను జైలు పాలు చేసుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేందర్, నిరంజన్, రఘు, రవి పాల్గొన్నారు. అనంతరం పారుపల్లి గ్రామంలో గతంలో నాటు సారాయి అమ్ముతూ పట్టుబడిన నీలం లక్ష్మి ్మ, మెట్టు లక్ష్మిలను ముత్తారం తాసిల్దార్ ఎదుట లక్ష రూపాయల పూచీకత్తుతో ఏడాది కాలానికి బైండోవర్ చేశారు.

# ఆర్టిజన్ ఆన్ మ్యాన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంథని ప్రభాతవార్త:



ఆర్టిజన్ ఆన్ మ్యాన్ కార్మికుల సమస్యలు ప్రభు త్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మంథని డివిజన్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆర్టిజన్ ఆన్ మ్యాన్ పీస్ రేట్ కార్మికులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీవీ ఏ ఈ జెఏసి జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి జిల్లా చైర్మన్ తుల నాగరాజు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబి రూల్స్ అమలు చేయాలని, విద్యా అర్హతతో కూడిన కన్వర్షన్ వెంటనే ఇవ్వాలని ఆయన తెలిపారు. సంస్థలో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతన అమలు చేయకపోతే ఈ నెల 30న డివిజన్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా కన్వీనర్ గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, ఖలిముద్దీన్, కో చైర్మన్ నాయిని ఓదెలు, కో కన్వీనర్ దండే దేవేందర్, జాయింట్ సెక్రటరీ పుల్లూరి గణేష్, తిరుపతి, రాజశేఖర్, వెంకటరమణ, శ్రావణ్, కృష్ణ సర్వేశ్, భాస్కర్, రాజేందర్, రమేష్, జానీ, వంశీకృష్ణ, సాయి, నిరంజన్, సంతోష్, సలీం, నాగరాజు, కృష్ణాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 68 సబ్ స్టేషన్ లో సుమారు 17 కోట్లతో ఆటో మీషన్ విధానం

**జిల్లాలో 1,30 లక్షల మందికి గృహ జ్యోతి పథకం**

**విద్యుత్ ఎస్ ఈ గంగాధర్**



రామగిరి ప్రభాతవార్త పెద్దపల్లి జిల్లాలో 68 సబ్ స్టేషన్ లో సుమారు 17 కోట్ల రూపాయలతో ఆటో మిషన్ విధానం ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ ఎస్ ఈ, వి. గంగాధర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ సబ్ స్టేషన్ ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లా విద్యుత్ సంస్థ పరిధిలో నెంబర్ వన్ గా నిలిచిందని, దీనికి కారణం విద్యుత్ అధికారులు సిబ్బంది తోపాటు సీఎన్ఎండి వరుణ్ రెడ్డి కారణమని తెలిపారు. జిల్లాలో నిరంతర విద్యుత్ కోసం ప్రతి సబ్ స్టేషన్ లో రెండు పీటిఆర్లు పెట్టామన్నారు. ఫాల్ట్ ఫాస్ట్ ఇండికేటర్ సిస్టం ద్వారా లైన్ బ్రేక్ అయినప్పుడు స్థానిప ఈ కి మెసేజ్ వచ్చే విధానం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 9 సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతుందని జూన్2లోగా 6 సబ్ స్టేషన్లు పూర్తి చేస్తామన్నారు. ప్రజా పాలన 99 రోజులలో రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తీర్చుతామన్నారు. గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 1.30 లక్షల మంది వినియోగదారులకు గృహజ్యోతి అందుతుందని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు ఈ స్కీమ్ అందే అందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో మంథని ఏడి ఈ ,వి. వెంకట నారాయణ, ఏఈ కే.మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఈనెల 28న బేగంపేట వారసంత వేలంపాట

**రామగిరి ప్రభాతవార్త:** రామగిరి మండలం బేగంపేట గ్రామ వారసంత వేలంపాట ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ మంథని చంటి, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10:30 గంటలకు వేలంపాట నిర్వహించడం జరుగుతుందని, కావున వేలం పాట లో పాల్గొనేవారు గంట ముందు పదివేల డిపాజిట్ లేదా నగదు అందజేయాలని, ఇట్టి వారసంత కాంట్రాక్టు గడువు సంవత్సరం ఉంటుందని తెలిపారు.

## పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**-పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు-కొమ్మిడి స్వర్ణలత**

మంథని రూరల్ ప్రభాతవార్త ;



మంథని మండలం ఆరెంద గ్రామానికి చెందిన కొమ్మిడి స్వర్ణలత సొంత భూమిలో వరి పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని మండలం అరెంద గ్రామంలోని సర్వేనెంబర్ 39,40 లలో మూడు ఎకరాల వరి పంట సాగు చేస్తుండగా శంకర పల్లె గ్రామానికి చెందిన దాశెట్టి జయసుధ దాశెట్టి తిరుపతి అనే వ్యక్తులు కొమ్మిడి శంకర్ సహాయంతో తమ వరి పంట పొలాన్ని బుధవారం రాత్రి ట్రాక్టర్ తో పంటను పూర్తిగా ధ్వంసం చేశారని బాధితురాలు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంథని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పోలీసులు రెవెన్యూ అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

## జల సంరక్షణ అందరి బాధ్యత

మంథని రూరల్ ప్రభాతవార్త :



భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత అని, అందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా భూగర్భ జలవనరుల అధికారి జి లావణ్య అన్నారు.. గురువారం మంథని మండలం పుట్టపాక గ్రామంలో నీటి సంరక్షణ అనే అంశంపై ప్రత్యేక కార్య క్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ జల పరిరక్షణ ప్రజలందరి తక్షణ కర్తవ్యం అని తెలిపారు. నీటి పొదుపు, సంరక్షణ, నీటి లెక్కింపు, ఇంకుడు గుంతల ఏర్పాటు, ఆరుతడి పంటల సాగు తదితర అంశాలపై రైతులకు, మహిళలకు అవగాహన కల్పించారు. రోజు రోజుకూ అడుగంటుతున్న భూగర్భ జలాలను పరిరక్షించుకొని నీటి నిల్వలను పెంపొందించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ముఖ్యంగా మహిళల పాత్ర ముఖ్యమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడాలజిస్ట్ సీహెచ్ వేణు, సర్పంచ్ రాజ బాబు, ఉప సర్పంచ్ శ్రవణ్, రిసార్స్ పర్సన్ లక్ష్మిరాజం, ఎన్జివో రేఖ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాములోరి కళ్యాణం

**-ఏర్పాట్లు పూర్తి చేసిన భక్తులు**

మంథని ప్రభాతవార్త:

జగదభి రాముడు శ్రీ రాముని కళ్యాణ వేడుకలకు మంథని పట్టణం ముస్తాబయింది. శ్రీరామ నవమినీ పురస్కరించుకొని శుక్రవారం మంథని పట్టణంలోని పలు దేవాలయాలు శ్రీ సీత రామచంద్రమూర్తి కళ్యాణ వేడుకలకు అంతా సిద్ధం చేశారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో, గోదావరి తీరంలోని శ్రీరాముని దేవాలయంలో, అదేవిధంగా పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో, శ్రీ షిరిడి సాయిబాబా



దేవాలయంలో, పుట్టపర్తి సాయి బాబా దేవాలయంలో, శ్రీపాద కాలనీలో, శ్రీరామ్ నగర్ లో, పెంజర్ కట్ట లోని దాగం లింగన్న నివాసంలో, ఎరుకల గూడెం లోని హనుమాన్ దేవాలయం లో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంతో పాటు మండలంలోని నాగారం, గుంజపడుగు, మైదుపల్లి, ఎక్లాస్ పూర్, అరెంధతో పాటు పలు గ్రామాల్లో శ్రీరామ చంద్రుని కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. దీనికోసం పట్టణంలోని పలు దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు.

# రాములోరి కళ్యాణం చూతము రారండి...

## కళ్యాణ శోభతో మెరిసిపోతున్న ఆలయాలు

గొల్లపల్లి, ప్రభాతవార్త :

శ్రీ సీతారాముల దివ్య కళ్యాణ మహోత్సవాన్ని దర్శించేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, మండలంలోని ఆలయాలు భక్తి పరవశంతో కళకళలాడుతున్నాయి. ప్రతి ఆలయం పచ్చని పందిళ్లు, రంగురంగుల అలంకరణలు, మంగళ వాయిద్యాల నాదాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయం సహా చిలువకోడూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, రాఘవపట్నం శ్రీ కోదండ రామాలయం, మల్లన్న పేట రామాలయం, లోతునూర్ శ్రీ కోదండ రామాల్నాయ, ఇస్రాజ్ పల్లి త్రికుటాలయం గాయత్రి పీఠ క్షేత్రంలలో సీతారాముల కళ్యాణానికి ఘనమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గొల్లపల్లి మండల కేంద్రంలోనిశ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయంలో ఐదు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా కొనసాగనున్నాయి. గురువారం గ్రామ ప్రజలంతా కలిసి భజనలతో, భక్తి గీతాలతో ఎడ్ల బండ్లలో కానుగాకు తీసుకెళ్లి ఆలయ ప్రాంగణంలో పచ్చని పందిరి ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శుక్రవారం ఉదయం పుష్యమి నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తంలో శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అనంతుల భూమయ్య తెలిపారు. ఈ దివ్య కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తులకు ఎల్సీడీ మానిటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం త్రాగునీటి సదుపాయం, చలువ పందిళ్లు, అన్నదాన కార్యక్రమం, రవాణా సౌకర్యం వంటి ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మహోత్సవ





ఏర్పాట్లను చిల్వాకోడూర్ ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, గొల్లపల్లి, లొత్తునుర్, రాఘవపట్నం, సర్పంచ్, నల్ల నీరజసతీష్ రెడ్డి, ఆకుల సుమన్ గౌడ్, కాసారపు భవాని అరవింద్ గౌడ్, ఉపసర్పంచ్ లు గురిజేల బుచ్చిరెడ్డి, ఒరగంటి మల్లేష్, శిరవేణి రవి ల తో పాటు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తున్నారు.

## మహిళా గురుకుల కళాశాలలో 'మహిళా సాధికారత'పై అవగాహన సదస్సు

జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:



శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జగిత్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో 'మహిళా సాధికారత' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు సైబర్ క్రైమ్ డీఎస్పీ ఎం. వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి డిజిటల్ యుగంలో ప్రతి విద్యార్థినీ సైబర్ నేరాల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ వెంకట రమణ సూచించారు. సోషల్ మీడియాను వినియోగించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని గుర్తుతెలియని వ్యక్తులతో పంచుకోవద్దని కోరారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం షీ టీం, భరోసా కేంద్రం ప్రతినిధులు విద్యార్థినులకు రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో సంప్రదించాల్సిన అత్యవసర నంబర్లను తెలియజేస్తూ, విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్.ఐ ఉమా సాగర్, సైబర్ క్రైమ్ ఎస్.ఐ కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గునుక శ్రీలత, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాలో వైద్య సేవలపై సమీక్షా సమావేశం

పెద్దపల్లి, ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, గర్భిణీలకు ఎర్లీ రిజిస్ట్రేషన్ చేయించడంతో పాటు బర్త్ ప్లాన్ ప్రకారం డెలివరీలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. పి.సి.వి. వ్యాక్సినేషన్ లక్ష్యాలను చేరుకోవాలని, ఎన్.సి.డి స్క్రీనింగ్ గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. టి.బి. నివారణలో భాగంగా నిక్షయ్ శివిర్ ఫేజ్2 ద్వారా అనుమానిత లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బ నివారణకు ఓ.ఆర్.ఎస్ కార్నర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 31 వరకు వివిధ పి.హెచ్.సిలలో స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ఈ



నెల 28న కునారం, 30న మేడారం, 31న ముత్తారం పి.హెచ్.సిలలో జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజమోళి, డాక్టర్ బి. శ్రీరాములు, డాక్టర్ వి. వాణిశ్రీ, డాక్టర్ కె.వి. సుధాకర్ రెడ్డి, డాక్టర్ బి. కిరణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు, మధుసూదన్, రాజేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి వార్త



## వేలం పాట ఈ నెల 28కి వాయిదా

ధర్మపురి, ప్రభాతవార్త:

ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం నిర్వహించిన వేలంపాటలో సరైన మొత్తంలో వేలం పాట పాడకపోవడంతో వాహన పార్కింగ్, శనివారం సంత కోసం నిర్వహించాల్సిన వేలంపాట ఈనెల 28 కి వాయిదా వేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన వేలంపాట కార్యక్రమాన్ని నిర్వహించగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు హాజరయ్యారు. వాహన పార్కింగ్, వార సంత కోసం నిర్వహించిన వేలంలో గత సంవత్సరం కంటే తక్కువ మొత్తంలో వేలం పాట పాడడంతో ఈ నెల 28 కు వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఇట్టి వేలంలో పాల్గొనాలనుకున్న నూతన అభ్యర్థులు డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకొని ఈ నెల 28 న ఉదయం 11.00 గం.లోపు మున్సిపల్ కార్యాలయానికి రావాలని కమిషనర్ తెలిపారు.

## వైభవంగా సీతారామ కళ్యాణం

ధర్మపురి, ప్రభాతవార్త:





ధర్మపురి క్షేత్రంలోని గోదావరి ఒడ్డున గల శ్రీ రామాలయంలో గురువారం ఉదయం సీతారాముల కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కళ్యాణం సందర్భంగా అర్చకులు ఉదయం వేళలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణంలో భాగంగా మంగళ సూత్ర ధారణం, అక్ష తారోపణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పక్షాన దేవస్థానం అధికారులు, అర్చకులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఉదయం నుండి రాత్రి వరకు రామాలయంలో భక్తుల సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన వంశపారంపర్య అర్చకులు తాడూరి బాలకృష్ణయ్య శర్మ, బలరామ శర్మ, రఘునాథ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# తీర్మానాలు లేకుండా నిధుల వినియోగం..

**రూ. 5.85 లక్షల డ్రా పై ఆరోపణలు**

**కొడిమ్యాల గ్రామ పంచాయితీలో వార్డు సభ్యుల అసంతృప్తి**

కొడిమ్యాల, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా కొడిమ్యాల గ్రామ పంచాయితీలో తీర్మానాలు లేకుండానే నిధులను వినియోగిస్తున్నారని వార్డు సభ్యులు ఆరోపించారు. గురువారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశం అనంతరం వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని డ్రైనేజీలు శుభ్రపరచడానికి, పాలకవర్గ ప్రమాణ స్వీకార ఖర్చులు, పంచాయతీలో ఇతర సామాగ్రి కొనుగోలు, మైసమ్మ చెరువు నుంచి నాచుపల్లి వెళ్లే మార్గంలో ఉన్న చిలుక వాగు



శుభ్రపరిచే పనుల కోసం రూ.5 లక్షల 85 వేల నిధులను ఎలాంటి అధికారిక తీర్మానం లేకుండానే డ్రా చేసినట్లు వారు పేర్కొన్నారు.. ఇకపై గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులు పంచాయితీ పాలకవర్గ సభ్యుల ఆమోదంతో లేదా టెండర్ విధానంలో మాత్రమే నిర్వహించాలనే తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్ జీవన్ రెడ్డి, ఈఓ వంశివర్ధన్ లకు వినతిపత్రం అందజేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ గుర్రం నర్సయ్య గౌడ్, వార్డు సభ్యులు కొలకాని మహేందర్, చిట్టిపాక రమేష్, మ్యాక రమ, పర్లపెల్లి అఖిల్, రాపర్తి నర్సింగరావు, దుబ్బాక రాధ, రాచకొండ దివ్య, కొండ కృష్ణవేణి, బోగ గౌతమి, జక్కుల రవి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ ఆవరణలో నేడు రాముని లగ్గం

**▸కళ్యాణానికి ముస్తాబైన వేదిక**

వేములవాడ, ప్రభాతవార్త:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ఆవరణలో నేడు శ్రీ సీతారాముల కళ్యాణం జరుగనుంది. కళ్యాణానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగులో రాజన్న, భీమన్న ఆలయం విరాజిల్లుతోంది. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనుబంధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివార్చన వేదిక వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలో రాములోరి కళ్యాణం జరుగనుంది. కళ్యాణానికి ఆలయాన్ని రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం 11గంటల 45 నిమిషాలకు అభిజిత్ లగ్నం సమూహూర్తమున రాములోరి కళ్యాణం జరుగనుంది. కళ్యాణానికి జోగినులు, శివ పార్వతులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.

**▸శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు...**



నేడు శ్రీరామనవమి సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారికి ఉపనిషత్తుల ద్వారా రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు చేస్తారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో శ్రీ సీతారామ చంద్రస్వామివారి కళ్యాణం వేద మంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహిస్తారు.

# రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

**⊙కలెక్టర్ సత్యప్రసాద్**

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :





మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాలు, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స పై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకుసూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను కాపాడుతూ, సమయానికి వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అదనంగా, అత్యవసర సేవలు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ఔషధాల నిల్వలు సమృద్ధిగా ఉంచాలని సూచించారు. అంతకుముందు గోదురు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఐదు లక్షల రూపాయలు లబ్ధిదారులకు అందజేస్తుందని అన్నారు. నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను వెనివెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వివో భవనంను, నూతన గ్రామపంచాయతీ భవనం పరిశీలించి పనులు తొందరగా జరపాలని సూచించారు. అనంతరం మండలంలోని డబ్బా గ్రామ శివారులో ఉన్న వాటర్ గేర్లు పరిశీలించి నీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో ఎప్పటికప్పుడు నీటిని పరిశీలించి వేసవి కాలంలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహారావు, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ జైపాల్ రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**⬟ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి, ప్రభాతవార్త:



భవిష్యత్తు అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనకు గణాంకాలు కీలకమని, అందుకే జనగణన2027 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తొలి దశలో చేపట్టనున్న హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణనలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమాచారం అందించాలని, సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా లేదా తప్పుడు వివరాలు ఇచ్చినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు.మే 11 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉన్న ఈ ప్రక్రియలో ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాలు, కుటుంబ వివరాలను నిశితంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగంపై పూర్తి అవగాహన ఉండాలని, అధికారులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ జాతీయ ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ ఎంపీఎస్‌ఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జలవాగుకు జలగండం..!

**▪కుంట కట్టకు గండి వృధాగా పోతున్న నీరు**
**▪పట్టించుకోని అధికారులు**
**▪కట్టకు మరమ్మతులు చేపట్టాలి అంటున్న స్థానికులు**

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



రెండు నెలలుగా కుంటకట్టకు గండిపడి నీరు వృధాగా పోతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కోనరావుపేట మండలం మరిమడ్ల అటవీ ప్రాంతంలో ఉన్న జలవాగు కుంటకు గండి పడింది. నిత్యం ఈ ప్రాంతంలో అటవీ జంతువులతో పాటు పశువులకు మేకలకు తాగునీరు అందిస్తుంది. రెండు నెలలుగా కట్టకు గండిపడి కుంటలో ఉన్న నీరు అంతా వృధాగా బయటకు వెళ్ళిపోతుంది. గతంలో సైతం ఈ విధంగానే కట్టకు గండిపడగా ఉపాధి హామీ పథకంలో భాగంగా మరమ్మతులు చేపట్టారు. తిరిగి అదే విధంగా కట్టకు గండిపడి నీరు వృధాగా పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవికాలంలో అటవీ జంతువులకు పశువులకు దాహార్తి తీర్చే కుంట కట్టకు మరమ్మతులు చేపట్టాలని బిజెపి సీనియర్ నాయకుడు కుమ్మరి దిలీప్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృధాగా పోతున్న నీరును కుంటలోనే నిల్వ చేసేలా కట్టకు మరమ్మతులు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# కొండగట్టులో నేటి నుండి శ్రీరామ ఆంజనేయ సైకత కళా ప్రదర్శన

**✽అంతర్జాతీయ సైకత శిల్పి వరప్రసాద్ ఆధ్వర్యంలో అద్భుతంగా శిల్పాలు**
**✽రాముడు, సీతమ్మ, హనుమంతుడి సైకత శిల్పాలతో మరో ఆధ్యాత్మిక ప్రపంచం**

మల్యాల/ ప్రభాతవార్త





ప్రముఖ పుణ్యక్షేత్రం ఆంజనేయ స్వామి దేవస్థానం కొండ కింద శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి పక్కన అంతర్జాతీయ సైకత శిల్పి బాలాజీ వరప్రసాద్ నేతృత్వంలో అద్భుతమైన హనుమంతుడు సంజీవిని పర్వతాన్ని తీసుకువచ్చే ఘట్టం, శ్రీరామ చరితంలోని అపూర్వ దృశ్యాలు, ఇసుక శిల్పాల రూపంలో రూపొందించిన శ్రీరాములు, సీతమ్మ ,హనుమంతుని సైకత (ఇసుకతో) శిల్ప కళా ప్రదర్శన కు సిద్ధమైంది, శ్రీరామ చరితము, సైకత దైవ దర్శనం, భక్తి, కళ, ఆధ్యాత్మికత కలిగే విధమైన అద్భుత అపురూప ఘట్టానికి గత పక్షం రోజులుగా ఇసుకతో శిల్పాల ను రూపుదిద్దారు, శ్రీరాముని చరితము, హను మంతుని మహిమ, చరితను కళ్లకు కట్టినట్టు సైకత శిల్పాల తో తీర్చిదిద్ది ఏర్పాట్లను కొనసాగించారు. ఈ ప్రదర్శన మహోత్సవాన్ని శ్రీరామ నవమి రోజు ప్రారంభించి పెద్ద హనుమాన్ జయంతిమే 15 వరకు కొనసాగు తుందని ప్రోగ్రాం ఆర్గనైజర్ కోరుకంటి శిరీష శ్రీధర్ రావు లు తెలిపారు, తెలంగాణలో మొట్టమొదటిసారిగా భక్తి కళ ఆధ్యాత్మికత కలిసిన అద్భుత ప్రదర్శన కొండగట్టు అంజన్న ఆశీస్సులతో ఈ మహోత్సవాన్ని తల పెట్టినట్లు, ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో కలిసి సైకత దైవ దర్శనం చేసుకోవాలని వారు కోరారు,

## సైన్స్ ఎగ్జిబిషన్ ను సందర్శించిన మున్సిపల్ ఛైర్మన్..

*జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త:*

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న సైన్స్ ప్రాజెక్టులను సందర్శించిన మున్సిపల్ ఛైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



మాట్లాడుతూ వారి ప్రతిభను అభినందించారు. భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి చేరాలని, విద్యార్థినీ, విద్యార్థులను వారి తల్లిదండ్రులు పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. పాఠశాల అభివృద్ధికి మున్సిపల్ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఎల్లవేళల అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొలుగూరి సురేష్, ప్రధానోపాధ్యాలు సుధాకర్, అధ్యాపకులు, కందాల రాము, గడ్డం దీక్షి త్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపల్ పాలకవ్నర్గ అత్యవసర సమేవేశం.....

### 32 అభివృద్ధి పనులను ఆమోదించిన పాలకవర్గం...

*జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;*

జమ్మికుంట మున్సిపాలిటీ పా లకవర్గం గురువారం అత్యవసర సమావేశం కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన వేసవి కాలంలో నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు బోర్ ల రిపేర్, వాటర్ ట్యాంక్ ల ఏర్పాటు, పారిశుధ్య, వాటర్ సప్లై ,



ఆఫీస్ సిబ్బంది 202627 ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపు, అన్ని పార్కలలో లైటింగ్ ఏర్పాటు , స్ట్రీట్ లైట్స్ కోనోగోలు , హమాలి సన్నఘ కార్మికులకు టాయిలెట్ బ్లాక్ ఏర్పాటు చేయడం వంటి 32 అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్, చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్ లు మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు తెలిపిన వార్డులలో ఉన్న సమస్యలను, పారిశుధ్య కార్మికులు వార్డుకు ఇద్దరు కాకుండా మూడు వార్డుల కార్మికులను ఒకే సారి గ్యాంగ్ వర్క్ కేటాయించి వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లి, వార్డులలో పేరుకుపోయిన ప్రతి సమస్యను పాలకవర్గం సమక్షంలో పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ ముంతాజ్ అలీ జావెద్ , మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, జె.ఏ.ఓ. రాజశేఖర్ రెడ్డి, ఏఈ వికాస్, టీపీఓ శ్రీధర్, రాజ్ కుమార్, దీపిక ,సీనియర్ అసిస్టెంట్ వాణి, ఆర్ ఐ భాస్కర్ ఎస్ ఐ మహేష్ , మున్సిపల్

## చెట్ల పొదలను తొలగించిన పాలకవర్గం.

*వీణ వంక,ప్రభాత వార్త:*

వీణ వంక మండలం మళ్ళా రెడ్డి గ్రామం నుండి నిత్యం అదే మండలములోని చల్లూరు గ్రామానికి ఆ గ్రామస్థులు ప్రయాణం చేస్తుంటారు . గురువారం అందులో భాగంగానే ప్రయాణీకుల సౌలభ్యం కోసం ఆ రెండు గ్రామాల మధ్య రోడ్డు కు ఇరువైపుల ఉన్న చెట్ల పొదలను జె సి బి సహాయముతో గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్,ఉప సర్పంచ్ ఆర్ష ము శ్రీనివాస్ తో పాటు పాలక వర్గం తొలగించారు.



## నేడు శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం..

*కమలాపూర్: ప్రభాత వార్త*

.శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు కమలాపూర్ మండలంలో ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవమును జరపనున్నారు. ఈ సందర్భంగా గూడూరు గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ మండపంలో మొట్టమొదటిసారిగా



గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం గ్రామస్తుల సహకారంతో అర్చకుల సమక్షంలో అత్యంత వైభవముగా జరగనున్నది."శ్రీరామ కళ్యాణం మానవాళికి మార్గదర్శకం" అని అర్చకులు అన్నారు. ఈ కళ్యాణ మహోత్సవం గ్రామస్తులందరికీ పవిత్రమైన పర్వదినం అని, శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షి ంచి, తమ జీవితాలను పవిత్రం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గూడూరు గ్రామంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కల్యాణవేదిక, టెంట్లు ఏర్పాటు చేశారు. స్వామి వారి కల్యాణం అనంతరం హోమం కార్యక్రమం నిర్వహించబడునని అర్చకులు తెలిపారు. సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఇట్టి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి గ్రామస్తులందరూ హాజరై శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షి ంచాలని అర్చకులు కోరారు.

## 40లక్షల సీసి రోడ్డు పనులకు శంకుస్థాపన

*చిగురుమామిడి, ప్రభాత వార్త :*



చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామం లో ఎన్ ఆర్ ఈ జీ ఎస్ కింద మంజూరు అయిన 40లక్షల సీసీ రోడ్ల పనులను సర్పంచ్ కొంకట మోనిక గురువారం రోజున ప్రారంభించారు. ఇందులో భాగంగా 9వార్డు లో భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం లో అవసరం అయిన చోట సీసీ రోడ్లు వేయటం జరుగుతుందన్నారు. గ్రామం లో సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని గ్రామస్థులను కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు మిట్టపల్లి ఆదర్శ్, కానుగంటి సత్యనారాయణ రెడ్డి, కుమార్ గౌడ్, మామిడి రమేష్, మేడుదుల కొమురయ్య, మిట్టపల్లి సన్నీ, మాతంగి అని తదితరులు పాల్గొన్నారు

## పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### పోచంపల్లి సర్పంచ్ అంబటి స్వామి..

*మానకొండూర్, ప్రభాతవార్త :*

పాడి రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పోచంపల్లి సర్పంచ్ అంబటి స్వామి అన్నారు. గురువారం మండలంలోని



పోచంపల్లి గ్రామంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం పశు వైద్య, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అంబటి స్వామి, ఉప సర్పంచ్ కాల్వ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాడి పశువుల ద్వారా ఆర్థికంగా కుటుంబం అభివృద్ధి చెందుతారన్నారు. ప్రతి ఒక్క రైతు పశువులను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారులు, సిబ్బంది. పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

*చిగురుమామిడి, ప్రభాత వార్త :*

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో గడిల శ్రీ హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ డైరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు శంకుస్థాపన చేశారు. కరీంనగర్ డైరీ మాజీ ఎండి ప్రస్తుత అడ్వైజర్ ఒరుగంటి హనుమంత రెడ్డి ఆహ్వానం మేరకు శంకుస్థాపనలో పాల్గొన్నారు. బొమ్మనపల్లి గ్రామ ప్రజలు. కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల రైతులు అదనంగా వచ్చే పాడి పంటలతోటి ఆనందంగా ఉండాలని పిలుపునిచ్చారు. బొమ్మనపల్లి పాల ఉత్పత్తిదారులకు శ్రీరామనవమి



శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడీల శ్రీ హనుమాన్ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపకులు. ఒరుగంటి అరుణాదేవి, హనుమంత రెడ్డి, గ్రామ ప్రధాన పురోహితులు శ్రీ రామకో మల్లినాదశాస్త్రి, మాజీ సర్పంచ్ కానుగంటి భూంరెడ్డి, గ్రామ ఉపసర్పంచి కాసర్ల హరీష్ కుమార్, మాజీ ఎంపిటిసి మిట్టపల్లి మల్లేశం, కత్తుల రమేష్ మాజీ ఉప సర్పంచ్ పెండల శారద, సదానందం, వార్డు సభ్యులు చట్ల శృతి, ఒర్సు తిరుమల, కత్తుల లక్షి ్మ, ట్రస్టు బోర్డు అధ్యక్షులు తాటిపల్లి లింగారెడ్డి, కోశాధికారులుకంది శంకర్, తాటి పెల్లి శ్రీనివాస్, గ్రామ సమైక్య సంఘాల మహిళలు. గ్రామ ప్రముఖులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు లక్ష్యంతో ఉన్నత స్థాయి కి ఎదగాలి.....

### మండల విద్యాధికారిని.

*వీణ వంక,ప్రభాతవార్త :*

విద్యార్థులు కష్ట పడి చదివి మంచిలక్ష ్యలతో ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి నీ ఎస్ శోభారాణి అన్నారు. గురు వారం వీణ వంక మండల కేంద్రంలో నీ కేరళ ఇంగ్లీష్ మీడియము హై స్కూల్లో ప్రిన్సిపాల్ మనోజ్ అధ్యక్షతన సిల్వర్ జూబ్లీ జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి, మిలీనియం స్కూల్ కరెస్పాండెంట్, గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన లు మాట్లాడుతూ విద్యార్థులు ఒక బోధన ద్వారా నే కాకుండా అన్ని రకాల విద్య ను అభ్యసించినప్పు డే పై తరగతుల్లో ఉన్నతి స్థాయి నీ పొందుతారని కొనియాడారు. దీనికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతే కాకుండా ఈ స్కూల్ ద్వారా విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు మంచి స్థానాల్లో స్థిరపడ్డారని అన్నారు. ఈ స్కూలు ను అనేక ఒడిదోడు కుల మధ్య స్థాపించి సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం



అభినందనీయమని వారితో పాటు ట్రినిటీ స్కూల్ డైరెక్టర్ థామస్ లు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసి ఆట పాటలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో వివిధ పాఠశాల ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులు, తల్లితండ్రులు పాల్గొన్నారు

## డ్రగ్స్ సేవిస్తే ప్రాణాలకు ముప్పు

### -- ఎస్ఐ యూనస్ అలీ

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

యువత డ్రగ్స్ అలవాటు చేసుకుంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హుజురాబాద్ ఎస్ఐ యూనస్ అలీ అన్నారు. గురువారం హుజురాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన సదస్సు




జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత పాశ్చాత్య నాగరికతకు ఆకర్షితులవుతున్నారని, ఇంతేకాక అనేక చెడు అలవాట్లకు బానిసవుతున్నారని అన్నారు. నేటి యువత రేపటి దేశ భవిష్యత్తును కాపాడే వ్యక్తులని, అందువల్ల చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలను సేవించడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, అనేక అనర్థాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి, ఏఎస్ఐ కమల, ఆంటీ డ్రగ్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ లింగారెడ్డి, డాక్టర్ సరళ, ఝాన్సీ రాణి, డాక్టర్ జి. స్వరూప, డాక్టర్ రేణుక, డాక్టర్ మహిపాల్ రెడ్డి, డాక్టర్ పల్లవి, డాక్టర్ నరేందర్, రమేష్, రమ, ఆర్గనైజర్ ఇల్లందుల సమ్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## అఖిలపక్షం ఆధ్వర్యంలో నాలుగవ రోజు దీక్ష

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

గురువారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద హుజురాబాద్ పట్టణ శివారులోని గణేష్ నగర్ - సిర్సపల్లి ల మధ్య ఏర్పాటు చేయ తలపెట్టిన డంపింగ్ యార్డ్ వ్యతిరేక అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో నాల్గవ రోజు దీక్ష జరిగింది. ఈ దీక్షలో ప్రజాసంఘాల నాయకులు బెల్లి రాజయ్య, ఎడ్ల విజయ్ కుమార్, కొలిపాక సమ్మయ్య,



కల్లెపు హనుమంత రావు, వెంకటరెడ్డి, పాకాల రజనీకర్, యతీశ్వర్ రెడ్డి, పలకల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, వేల్పుల ప్రభాకర్, సందెల వెంకన్న, గుడిపాటి జైపాల్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, చందుపట్ల జనార్ధన్, గుడిపాటి సరిత, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండారెడ్డి, పొరెడ్డి దయాకర్ రెడ్డి, ఐలయ్య, ఉప్పు శ్రీనివాస్, కట్కూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా ఎడవెల్లి కొండారెడ్డి మాట్లాడుతూ... డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల విడుదల అయ్యే అనేక విషవాయువుల వల్ల ప్రజలకు క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుందని అన్నారు. నీటి కాలుష్యం, వాయు కాలుష్యంతో ఈ ప్రాంతం అన్యాయమైపోతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాట్లు విరమించుకోవాలన్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఫోన్ ద్వారా దీక్ష చేస్తున్న నాయకులకు మద్దతు ప్రకటించారు. అసెంబ్లీ తర్వాత తాను కూడా దీక్షల్లో పాల్గొంటానని అన్నారు.

## హుజురాబాద్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా శేషయ్య

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

స్థానిక బార్ అసోసియేషన్ 2026-27 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి. మొత్తం 125 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, ఎన్నికల అధికారులు జోజుల



ప్రవీణ్ కుమార్, గురాల వెంకట్ కుమార్, బాగోతు కుమారస్వామి ఫలితాలను వెల్లడించారు. విజేతల వివరాలు... అధ్యక్షుడుగా కేసరి శేషయ్య (63 ఓట్లు) తన సమీప ప్రత్యర్థి శంకర్ కనుకుంట్ల పై విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా పాక జ్యోత్స్న దేవి 85 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడుగా రాజేష్ పిట్టాల (84 ఓట్లు), జాయింట్ సెక్రటరీగా యెంగాల లింగమూర్తి (47 ఓట్లు), క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా మోరే కళ్యాణ్ (74 ఓట్లు), జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా యాస్మీన్ (66 ఓట్లు) వచ్చాయి. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా ముగియడంతో నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

## డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

### -- త్వరలో సీఎంను కలుస్తా.... శాశ్వత పరిష్కారాన్ని కృషి

### -- వి. ప్రణవ్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ పట్టణ శివారులో ఏర్పాటు చేయతలపెట్టిన డంపింగ్ యార్డ్ రద్దుకై శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద డంపింగ్ యార్డ్ ఏర్పాట్లను నిరసిస్తూ నాలుగు రోజులుగా చేస్తున్న దీక్షా శిబిరం వద్దకు వెళ్లి వారికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక పనులను కాంగ్రెస్, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ రోజు చేయబోదని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు ఈ సమస్యపై వివరించామని, ప్రజలకు హాని చేసే ఏ పనిని అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒప్పుకోదని, డంపింగ్ యార్డు వలన ప్రజలకు తలెత్తే సమస్యలను అధికారులకు వివరించామని, వివిధ కార్పొరేషన్, మున్సిపల్ నుండి వచ్చే చెత్త వలన చెడు పరిమాణాలు ఎదురవుతాయని అన్నారు. హుజురాబాద్ లో డంపింగ్ యార్డు వద్దని, జనాలు నివాసం లేని చోట నిర్మించుకోవాలని సూచించామని అన్నారు. ఈ ప్రతిపాదన 2022 లోనే చేశారని, అప్పుడే అప్పటి నాయకులు అడ్డుకుంటే ఈ పరిస్థితి ఉండబోయేదని అన్నారు. ఈ సమస్య పార్టీలకు అతీతంగా సామరస్యంగా హుజురాబాద్ భవిష్యత్ కోసం కృషి చేయాలని, దీని కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు గురువారం హుజురాబాద్‌లోని కాకతీయ జూనియర్ కళాశాలలో బహుమతుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. హుజురాబాద్, జమ్మికుంట, ఇల్లంతకుంట మండలాల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని, బండ శ్రీనివాస్, హుజురాబాద్ ఎంఈఓ



శ్రీనివాస్ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రొంటాల బుచ్చయ్య అధ్యక్షత వహించగా, భోగం రమేష్ స్వాగతం పలికారు. మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బి. సాంబశివరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సమాజ సేవలో భాగస్వాములవుతూ దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవ వికాస వేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు భోగం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కలకోటి వెంకటేష్, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు పేరుక సుందరయ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదుగుల ఓదెలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంటాల బుచ్చయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపి ఈటల

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

హుజురాబాద్ ప్రాంతంలో ఇటీవల మృతి చెందిన పలువురు నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను గురువారం మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్



సందర్శించి పరామర్శించారు. హుజురాబాద్ పట్టణంలోని గోస్కుల చందు మాతృమూర్తి మరణించగా ఆయనను, 20వ వార్డు కౌన్సిలర్ దామెర అనూష నానమ్మ సురభి కమలాదేవి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, ధర్మరాజు పల్లి గ్రామంలో తొలి రైతుబంధు పథకం లబ్ధిదారుడు మూగల సంజీవ రెడ్డి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆయన సందర్శించి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈటల వెంట బిజెపి నాయకులు నల్ల సుమన్, దామెర అనురాగ్, ప్రభాకర్ రెడ్డి, గోస్కుల సమ్మయ్య, సురభి వేణు, రమ్య, గొట్టిముక్కుల రవీందర్ రావు, రఘు, లింగం తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

### -- వి. ప్రణవ్ బాబు

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. గురువారం హుజురాబాద్ లో ఎల్ఐసి ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్లు ప్రణవ్ బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర కీలకమైందని అన్నారు. ఎల్ఐసి ఏజెంట్లకు మాజీ రాజ్యసభ సభ్యులు వొడితల రాజేశ్వర్ రావు ఎల్ఐసి బిల్డింగ్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్డింగ్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ఎల్ఐసి ప్రతినిధులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

కామేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త :

రబీ సీజన్ లో పండిన మొక్కజొన్నలు కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మార్క్ ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కామేపల్లి తహశీల్దార్ కార్యాలయం లో రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించాంజానయ్య పాల్గొన్నారు.